శ్రీ

ఆంధ్రసాహిత్య
పరిషత్పత్రిక.

రెండు నెలల కొకసారి ప్రకటింపఁబడును.

(Journal of the Telugu Academy.)

సంపుటము. ౨3 { భావనామసంవత్సరము. శ్రావణభాద్రపదమాసములు. } సంచిక 3.



కాకినాడ:

కొత్తపల్లి సూర్యారావుచే బరిషత్కార్యాలయమునఁ
బ్రకటింపఁబడినది.

చందా, పోష్టువ్యయములతో సంవత్సరమునకు రు. 3-౦-౦.

విడిసంచిక రు ౦-౮-౦.

1934.

విషయసూచిక.

ఆంధ్రసాహిత్య పరిషత్పత్త్రిక.

కాకినాడ.

రెండునెలల కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౨3. | భావనామసంవత్సరము. శ్రావణభాద్రపదమాసములు. | సంచిక 3.

వేణీసంహారము-నాయకుఁడు.

—: యామిజాల పద్మనాభస్వామిగారు, విజయనగరము :—

పరిషత్పత్త్రికలో శ్రీ యం. సూర్యనారాయణమూర్తిగారి "వేణీసంహారే భీమ ఏవ నాయకః" అనువ్యాసముఁ జదివితిని. వారివ్యాసప్రభావమున నాహృదయఫలకమునఁ జిత్రితములైన కొన్నిస్వకీయభావచిత్రములను బైకిఁదీసి పరిషత్పత్త్రికాముఖమునఁ బండితప్రవరులహస్తముల కందిచ్చుచున్నాఁడను. నాయీచిత్రమునఁ గలలోపములను దీర్చి దిద్దుభారము సకలకళాప్రవీణు లగువారి లేఖనీపింఛికలకే విడిచిపెట్టుచున్నాఁడను.

నాయకశబ్దమునకు వ్యుత్పత్తిమూలముగ నర్థముఁ జెప్పి తత్ఫలమును శౌర్యమధ్యమునోడిలోఁ బడవేసిరి. అదియంత సమంజసము కాదు. ఏల యందురా! అభిజ్ఞానశాకుంతలమున శకుంతలాదుష్యంతుల పునస్సమాగమమునకుఁ బ్రధానభూత మంగుళీయకము కదా యని తన్నాటకమున నాయకత్వము నంగుళీయకమున కంటఁగట్టుట న్యాయమా? జానకీపరిణయమున హరుని ధనువు శుల్కముగ రాముఁడు సీతమ్మను వివాహమాడుట సంభవించెఁగదా యని పురారిశరాసనమునకే నాయకత్వ మాపాదించుట యుక్తమా? అట్లే శపథము ననుసరించి వేణీసంహార మొనర్చినంతమాత్రాన భీముఁడే నాయకుఁ డనుట సమంజసమా? యుక్తియుక్తమా?

ధర్మరాజు సచివాయత్తసిద్ధిగల నాయకుఁడా? కాఁడా? ధర్మరాజు సచివాయత్తసిద్ధి గల నాయకుఁ డగుచో నాతనినే నాయకునిగ నంగీకరింతు మనునుద్దేశ

ముతో నొకహేతువును జూపి ధర్మరా జట్టివాఁడు కాఁడని త్రోసివేసిరి. దాని కుదాహరణము—"అద్యైకం దివసం''......ఇత్యాది. భీమునికిది కళంకము. తాత్కాలికవృథారోషపిశాచీవికారావేశపరుషాలాపములే కాని తదాధారక్రియా చరణాయత్తచిత్తవిస్రబ్ధాలాపములుగా భీమవాక్కులు మాఱలేదు. 'నాహం విధేయ స్తవ'' యని భూనభోంతరాళములు మాఱ్మ్రోగునట్లు బిగ్గరగఁ బెడబొబ్బవెట్టిన భీముఁడే "దేవ-అజాతశత్రో-భీమార్జునగురో-యథైవాజ్ఞాపయసి-నతథైవేతత్-'' అని పలికినాఁడు కదా! దీనినిబట్టి భీముఁడు ధర్మరాజునెడల సంతతము వినయవిధేయతలు కలవాఁడై యున్నాఁడని తేలుచుండుట నిజమే కదా! "నాహం విధేయ స్తవ''యని సాక్రోశముగఁ బలికినశూరశిఖామణి యగువాఁడే పాదములఁబడి "జయతు జయ త్వార్యః''యని వచించినపు డీతనియందుఁ గలవిరుద్ధభావ మేమైపోయినది? "గురు మనువర్తస్వ'' యనుభీముఁడు విధేయుఁడా? అవిధేయుఁడా? అప్పుడు ధర్మరాజు సచివాయత్తసిద్ధిగల నాయకుఁడని చెప్పుట సాహసము కాదు. ఇంకను సూర్యనారాయణమూర్తిగారు ధర్మరాజునకుఁ గేవలము భీమునే సచివునిగాఁ జెప్పుట తొందరపాటుగా భావించెదను. ధర్మజుఁ డెన్నఁడును భీముని సచివునిగాఁ దీసికొని యేకార్యమునకును నుపక్రమింపలేదు. ముఖ్యముగ భీమసహాయత్తవ్యాపారుఁడై ధర్మరాజు జయించుట లేదని కూడ విన్నవించుచున్నాఁడను. ద్రౌపది-లేక శ్రీకృష్ణుఁడు. ఈయిద్దఱితో, మంత్రాలోచనసేయక ధర్మరా జెట్టిపనికిని జొరఁబడలేదని చెప్పవచ్చును. మఱియు ద్రౌపదిమాటటుండనిండు. శ్రీకృష్ణుఁడు లేనిదే ధర్మరా జేకార్యమును గలలోనైనఁ జేసి యెఱుంగఁడనుట వీరెఱింగియేయుందు రని నాయుద్దేశము. అప్పుడు యుధిష్ఠిరుఁడు శ్రీకృష్ణసచివాయత్తసిద్ధిగలవాఁడా? భీమాయత్తసిద్ధిగలవాఁడా? ఈనాటకమున నది సరిపడ దందురా? అప్పు డీవేణీసంహారఫలమును ధర్మరా జొందుచున్నాఁడా? ద్రౌపదియా? ఆవిమర్శకుఁ గడంగునపుడు ద్రౌపదికే ప్రాధాన్యము కలదు కాని ధర్మరాజున కెంత వెతకినను గన్పట్టదు. తుదకు ధర్మజుఁడును గాఁడు భీముఁడును గాఁడు.

ఇంకలక్ష్యలక్షణసమన్వయమా?—ఈనాటక మప్పటి లక్షణగ్రంథములకన్న మున్న రచింపఁబడినదిగాన నాగ్రంథములకును దీనికిని లక్ష్యలక్షణసంబంధమనావశ్య మనుభావమును సూచించిరి. దీనినిబట్టి యేకవివ్రాసినగ్రంథమేని లక్షణశాస్త్రవిరుద్ధము కాకుండ నుండవలె నని సూర్యనారాయణమూర్తిగారి యుద్దేశ్య

మైయున్న దని నాయూహ. కాని యిప్పుడు కుప్పలుగ నుప్పతిల్లుచున్న గ్రంథములలో ముప్పాతికమూఁడువంతులు లక్షణగ్రంథముల ననుసరించియే యున్నవా?

"నిరంకుశాః కవయః" యను సూత్ర మెంతవఱకు నిల్చును?

పైసూత్రమునకు సరిపోయినంత సంబంధ మున్నది. ఏ మందురా? గణయతిప్రాసములకును విషయనిగరణమునకును దిగునప్పు డసాధ్యములగు స్థలములందే కవులు పెడత్రోవలకుఁ బోవుచున్నారు, కాని, మాయిష్ట మని సారస్వత ప్రపంచరంగస్థలమునకు దిగుట లేదు. తావన్మాత్రమున నట్టి నిరంకుశత్వాధిపత్య కళంకసూత్రమును గవులగళసీమలఁ బూర్తిగబంధింపకుఁడు. ఇందు మఱొక చిన్ని రహస్యము కలదు. తన కసాధ్యము లగుపట్ల వ్యాఖ్యాత యాయసామర్థ్యమును గవి కాపాడించుటకై "నిరంకుశాః కవయః" యనుచున్నాఁ డని నాయూహ.

ఇందలి రసము వీరమా? రౌద్రమా? రసవిషయమై శ్రీ కట్టా అచ్యుత రామశర్మగారు కొద్దిదినముల క్రిందటనే యొక వ్యాసము వ్రాయుచు రౌద్ర మని నిరూపించిరి. మొన్నటి పరిషత్పత్రికలో మన సూర్యనారాయణమూర్తిగారుకూడ రౌద్రమును గానె యొప్పుకొనుచున్నట్లు కుడ్యమార్జాలన్యాయముగ సూచించిరి. వీరిరువురివాదనఁ గొంత పరిశీలింతము.

"రసము రౌద్రము—రౌద్రమునకు స్థాయి క్రోధము. ధర్మరాజునకుఁ బంచమాంకమువఱకు ప్రవేశమే లేదు. షష్ఠాంకమందే ధర్మరాజోత్సాహము కొంత వర్ణిత మైనది. భీమున కట్లు కాక ప్రథమాంకద్వితీయాంకములలోనే ప్రవేశ మిచ్చి రౌద్రస్థాయి యగు క్రోధ మధికముగ "చంచద్భుజే"త్యాదులచే విశేషముగవర్ణింపఁబడినది. వీరరసమున కట్లుకాలేదు. రౌద్రమే అంగిరసము."

ఇది వీరిభావము. కాని దాని నంగీకరింపఁగూడదు. ఈనాటకమున రౌద్రము విశేషముగ వర్ణితమైనను, దాని నంగరసముగఁ గవిచేఁ బ్రత్యవేక్షిత మా నట్లూహించుట కవకాశమున్నది. 'యత్సత్యవ్రతే'త్యాది వర్ణనలచే వీరరసబీజము స్పష్టముగ నుపక్షిప్త మయినట్లు దెలియవచ్చుచున్నయది- ఇంకను బంచమాంకమున "భోభో భీమార్జునా నిహితాశేష అరాతిచక్ర ఆక్రాంతపరశురామయశాః, ప్రతాపస్థాపితదిఙ్మండలః శ్రీమాన్......దేవో యుధిష్ఠిర ఆజ్ఞాపయతి" ఇత్యాదివాక్యములచేతను, "కుర్వంత్వాప్తాహతానాం" ఇత్యాదివర్ణనలచేతను, యుధిష్ఠిరోత్సాహము పునఃపునః అనుసంధానమై వీరమునకే యంగిత్వము నాపాదించుచున్నది. మఱియు రౌద్రరస మధికము వర్ణిత మైనను దాని నంగత్వేన స్వీకరింపవలసినదే

కాని యంగిత్వేన స్వీకరింప వలనుపడదు. దానినే "అవిరోధీ విరోధీ వా రసో౽ంగిని రసాంతరే, పరిపోషం న నేతవ్య స్తథా స్యా దవిరోధితా" అని యానందవర్ధనాచార్యులవారు వ్రాసియున్నారు. మఱియుఁ "జంచద్భుజే"త్యాది వాక్యానంతరమే "అనుగృహ్ణంతు తే భ్రాతరః"యను ద్రౌపదీవాక్యములచేతను, "భోభో శృణ్వంతు భవంతః" ఇత్యాది నేపథ్యగతవృత్తాంతముచేతను, రౌద్రము ధర్మజాయత్తమై యున్న వీరమున కంగముగనే వివక్షచేయఁబడుచున్నది. ఇంక ననేకములగు నుపపత్తులు వీరరసామోదములు గన్పట్టుచున్నవి. కనుక రసము వీరమే యగును.

ప్రథమాంకమున "యత్సత్యవ్రతభంగభీరుమనసే"త్యాదివాక్యశ్రవణానంతరము భీమసేనుఁడు పలికిన "జృంభతాం జృంభతా మార్యస్య క్రోధజ్యోతిః"యను వాక్యమును, "ఆర్య గచ్ఛామో వయ మిదానీం గురుజనానుజ్ఞాతే"త్యాదిసహదేవవాక్యములును, "వత్స ఏతే వయ ముద్యతా ఏ వాచార్య స్యాజ్ఞా మనుష్ఠాతుం" అనుభీమసేనవాక్యమును, ధర్మరాజునకే నేతృత్వము నాపాదించుచున్నవి. మఱియు, "చత్వారో వయ మృత్విజః" అనుభీమవచనము రణయజ్ఞమున ధర్మజుఁడు యజమానుఁడనియు, భీమాదులు ఋత్విక్కు లే యనియుఁ జెప్పుచు ధర్మజునకే నాయకత్వమును జాటియిచ్చుచు భీముఁడు నాయకుఁ డనువారివాదమును ద్రోసిరాజనుచున్నది. మఱియు "వ్యాసో౽య"మిత్యాది శ్రీకృష్ణవాక్యము సకలసామ్రాజ్యాధిపత్యమునకు ధర్మరాజునే నిలిపి పుణ్యోదకములను వానిపైనే చల్లుచున్నది. మఱి భీముని మాటే లేదు. ఇట్టి యుపపత్తులనుబట్టి "ధర్మరాజే నాయకుఁడు" అని చెప్పనొప్పును. వీరరసమే యంగిరస మని చెప్పఁదగును.

ఆంధ్రవాఙ్మయసౌధము-విమర్శకుల కర్తవ్యము.

సా. వి. ప్ర. ఓలేటి వేంకటసుబ్బారాయశాస్త్రిగారు, ఇంజరము.

విచక్షణులారా!

ఇతరవాఙ్మయములతోఁ పాటాంధ్రవాఙ్మయము గూడ దినదినాభివృద్ధి నొందుచున్న దను విషయము సర్వజనవిదితమే. ఆంధ్రమున కెవ్వరు ప్రథమభిక్ష పెట్టినను నన్నయయే ప్రథమగణ్యుఁ డగుచున్నాఁడు. ఆతఁడు సదుద్దేశముతో నాంధ్రవాఙ్మయసౌధమునకు బల మగు పునాది నిర్మించుటనే సౌధ మున్నతస్థితిఁ బొందుటకు సమర్థ మగుచున్నది యని చెప్పవచ్చును. ఈసౌధమునకుఁ దొలుదొల్త సమర్థులగు కవీశ్వరులు సంస్కృతగ్రంథములను, ఆంధ్రములోనికిఁ బరివర్తించి సంస్కృతమిశ్రితాంధ్రగ్రంథేష్టకల నర్పించిరి. అందువలననే సౌధము కట్టుదిట్టముగా నున్నతస్థితిఁ బొందుటకుఁ దగున ట్లుండెను. "విషమోఽపి విగాహ్యతే నయః కృతతీర్థః పయసామి వాశయః। సతు తత్ర విశేషదుర్లభ స్సదుపన్యస్యతి కృత్యవర్త్మ యః" అనునట్లు సౌధనిర్మాణమునకై తగుపునాది నిర్మించునతఁడు దొరకుట యే చాలకష్టము. అట్లు కష్టపడి నిర్మింపఁబడినపునాదిపైఁ దిక్కనసోమయాజి మున్నగువారు గోడలను సాగించిరి. ఇందులకుఁ జాల సంతసింపవచ్చును. కాలవిపర్యయమువలన గోడలు కొంతవఱకు సాగినతరువాతఁ బని నెఱవేఱుట కాటంకములు వచ్చుటచేఁ గాఁబోలును నది నెఱవేఱినది కాదు. ఆకాలమున నాంధ్రభాషామతల్లి విచారింపకపోవునా? కాని నిర్మాణముహూర్తము బలమైన దగుట నదృష్టవశమున సమర్థు లగుకవీశ్వరులు బయలుదేఱి తగుగ్రంథములను భాషాంతరీకృతములతోఁ పాటు స్వతంత్రములఁ గూడ రచించి సమర్పించిరి. అమంచి యిటుకలతోఁ బని చురుకుగా నెఱవేఱుచు వచ్చెను. చాలవఱ కొక యచ్చుతోఁ దీసిన యిటుకలైనను గొన్ని క్రొత్తవన్నెచిన్నెలతో మంచికట్టుఁబాటుగా నుండి సౌధమును గట్టిపఱిచినవి. కాని యాకాలమందు నందములులేని ముక్కలు లేకపోలేదు. అవన్నియుఁ బైపైకి రాక లోలోపలనే యిమిడిపోయినవి. అపూర్వపుగ్రంథేష్టకల మంచిచెడ్డల విమర్శింపఁ దలంచుకొనలేదు. విమర్శించుట కిది తావు కాదు. కాకున్న నొకకవివాక్యముల జ్ఞాపకము మాత్రముచేయుదును. "చందనవృక్షాల

సర్పాలగములు, క్షీరసాగరమంను క్ష్వేడంపుముద్ద- అమృతాంశుబింబానవంకవి స్రుతియు, మంచిలోపలఁ జెడ్డ మలయుఁగాఁబోలు."

ఆంధ్రవాఙ్మయసౌధ మిట్లు భాషాంతరీకృతగ్రంథములచేతను స్వతంత్రగ్రంథములచేతను నిర్మింపఁబడుచున్నను స్వతంత్రములపై మొగ్గ తూఁగినట్లుండెను. స్వతంత్ర మెట్లైన స్వతంత్రమే. రానురాను నే హేతువునో భాషాంతరీకరణముపై నెక్కువమక్కువ కలిగినది. మక్కువకుఁ దగున ట్లుభయభాషలయందు నసమానప్రజ్ఞయుండి భాషాంతరములనుండి యాంధ్రమునకుఁ దీసికొని వచ్చినం జాలసంతసమే. కాని భాషాంతరములలోని కొద్దిజ్ఞానముతో నాంధ్రీకరించిన గ్రంథముల నిర్మించుట చాల నయుక్తము. అట్లు నిర్మించినగ్రంథములలో శాస్త్రగ్రంథములు, కావ్యములు, నాటకములు మున్నగునవి చాల నయుక్తములుగా నుండుటయేగాక మూలగ్రంథమున కగౌరవమును గూడఁ దేఁగలవు. ప్రకృతకాలమున నాంధ్రీకృతగ్రంథములలోఁ జాలభాగ మనుచితముగానే యున్న వని వ్రాయుటకుం జేయి సందేహించుట లేదు. భాషాంతరీకరణమునందు భాష యెట్లున్నను మూలగ్రంథములోని భావము స్ఫుటముగ వ్యక్తము కావలయును. భాషాంతరీకరణమందు భాషకన్న భావవ్యక్తియే ప్రధానము కదా? భావము స్ఫుటముగా వ్యక్తముకానిచో విపరీతభావస్ఫూర్తి యగుటయే గాక మూలగ్రంథములో ని ట్లున్న దని మూలగ్రంథమున కగౌరవము వాటిల్లుటయే గాక, పాఠకులకు విపరీతజ్ఞానముకూడఁ గలుగును. "విపరీతజ్ఞానముకన్న నజ్ఞానమే శ్రేయస్కర మని నాతలంపు'' అని మహామహోపాధ్యాయులు పరిషత్సభలో సెలవిచ్చినవాక్యమును బునఃపునః మననము చేయుట మంచి దని నామనవి.

ఆంధ్రధ్వనిని తాము పరిశీలించియేయుందురు. ఆనందవర్ధనాచార్యకృత మగుధ్వన్యాలోకమున కాంధ్రీకరణము. "కావ్యస్యాత్మా సఏవార్థ స్తథా చాదికవేః పురా, క్రౌంచద్వంద్వ వియోగోత్థః శోకశ్లోకత్వమాగతః'' అనికారిక. ...... "నతు మునే శ్శోకః'' ఇతిమన్తవ్యం, ఏవం హి సతి తద్దుఃఖేన సోపి దుఃఖిత ఇతి కృత్వా రసస్యాత్మతేతి నిరవకాశం భవేత్ నతు దుఃఖసంతప్తస్యైషాదశా'' అని లోచనకారుఁడు స్పష్టముగా వ్రాసియున్నాఁడు. ఇట్లున్నను దా మాదికవియొక్క శోక మని పద్యము వ్రాసియున్నారు. ఆంధ్రధ్వనికారులు:—

"అర్థమిదియ కావ్యంబున కాత్మయగును, అట్లగుట పూర్వకాలమం దాదికవికిఁ
గ్రౌంచవిహగయుగళవియోగమున నాత్మ, లోజనించిన శోకంబు శ్లోకమయ్యె''

ఇది విపరీతజ్ఞానదాయకము కాదా? నూతనకవిభూషణులు హంససందేశ మాంధ్రీకరించిరి. ఈగ్రంథము పూర్తిగా నిద్దఱును నసంపూర్తిగా నొక్కఁడును నాంధ్రీకరించిరి. వీరుచతుర్థులు. "కృత్వా తస్మి న్బహుమతి మసౌ భూయసీ మాంజ నేయా ద్గాఢోన్మాదః ప్రణయపదవీం ప్రాప వార్తానభిజ్ఞే, విశ్లేషేణ - క్షుభితమన సాం మేఘశైలద్రుమాణా యాచ్ఞాదైన్యం భవతి కిముత క్వాపిసంవేదనార్హే" అని హంససందేశములోని శ్లోకము వేదాంతాచార్యవిరచితము. మ. "అనిలాత్మోద్భవుకంటె నంచఁ గడుఁ దా నర్చించి వార్తానభి, జ్ఞునియందుణ్ దృఢచిత్త విభ్రమముచే సొంపేది స్నేహాయనం, బును బొందెన్ విరహంపువేళఁ గలుగుంబో క్షుబ్ధచిత్తాళికిణ్, వనదత్మాధరధామణీజములయాచ్ఞాదైన్యముల్ చెచ్చెరన్" అనిపద్యమును వ్రాసిరి. ఇదివిపరీతభావస్ఫోరకము కాదా? శ్రీభాష్య శ్రీనివాసాచార్యులు హంససందేశమునకు వ్యాఖ్య వ్రాసియున్నారు. "కథం వార్తానభిజ్ఞే హంసే మారుతేరపి బహుమానం కృత్వా ప్రణయపదవీ మవాపేత్యాశంక్య పరిహరతి కృత్వేతి-కథ మతివివేకినాం తిర్యగాదిషు స్నేహః? క్షుభితమనస్కత్వాత్ మేఘశైలద్రుమాదా అభ్రపర్వతవృక్షాదా యాచ్ఞా రూపదైన్యం సమ్భవతి, సంవేదనార్హే వృత్తాంతశ్రవణయోగ్యే క్వాపి కుత్రచి ద్విషయే చైతన్యవిశిష్టే. కిము తయాచ్ఞా సంభవత్యేవ. అయంభావః చైతన్యరహితే మేఘశైలద్రుమాదా ప్రార్థనాకృతాచే చ్చైతన్యవిశిష్టే యాచ్ఞాకరణం సుసంగత మితి" ఇట్టి స్పష్టమగువ్యాఖ్యయున్నను బ్రధాన మగుభావమును ద్రోసిరాజన్నారే. నేనిట్లు తమకెందులకై మనవిచేసితినో విమర్శించుట మీకృత్యము. నేను విమర్శనచేయు నుద్దేశ్యముతోఁ గాని, వారికవితల నిందించు నూహతోఁ గాని వ్రాయలేదు. విపరీతవిషయనిరూపణకై యథాలాభముగాఁ జూపించితిని. నాయందుఁ బొరపాటున్నచో క్షంతవ్యుఁడను. ఆంధ్రవాఙ్మయసౌధమిట్టి భాషాంతరీకృతములచేఁ గూడనిర్మింపఁబడుచుండగాఁ బూర్వ మొకయచ్చుతోనే చేసినయిటుకలు, మేము వ్యక్తి కొక్కొక యచ్చుతో నిటుకల సిద్ధముచేయుదు మనుపట్టుదలతో భావుకులు భావకవిత యనుపేర స్వతంత్ర గ్రంథమని తామనుకొను గ్రంథముల వ్రాసి సౌధమును నిర్మించుచున్నారు. పూర్వమువలె నిప్పుడు ను లేకపోలేదు. ఇప్పటివలెఁ బూర్వమును లేకపోలేదు. కాలభేదముమాత్ర మెక్కువ యున్నది. ఈనవీన గ్రంథములు గూడ సౌధమును నిర్మాణముచేయుటకు సమర్థములగుచున్నవి. ఇట్టియిటుకలలో నేవి చౌడురాలునో, పాడగునో, ఎవరుచెప్పఁగలరు. నవలలు మున్నగునవి కూడ సౌధమును దయారు

చేయ సమర్థములే, కాని వానిలోఁగూడ నెంతపాడు, చెత్త, యున్నదో విజ్ఞానులకే తెలియును. ఇట్టి గ్రంథేష్టకలచే సర్వకళల కాలయమైన యాంధ్రవాఙ్మయసౌధము పునాదినుండి, యంతస్తులవఱకును దినదినము వృద్ధిపొంది లోకమున వన్నెవాసి కలిగి చిరస్థాయిగా నుండి యితరవాఙ్మయసౌధములతో పాటు తులతూఁగుచున్నం దుల కెంతయో సంతసము. కాని యీసౌధోపయుక్తేష్టకలలోఁ జాల ననుచితములు, నసంబద్ధములు నుండుటచే సౌధ మున్నతస్థితిని బొందినకొలఁది గ్రిందికిఁబడి పోవునేమో యని భయముగా నుండకతప్పదు. అందులకై విమర్శకులు విమర్శనసుధచే గట్టిపఱుపవలయును. అట్లైనచో నీసౌధ మెంతయో సముచితముగ, సుదృఢముగ నుండి పడిపోక యున్నతస్థితి పొందినకొలఁది సముచితముగా నుండి యాచంద్రార్కస్థితిని బొందఁగలదు.

ఆంధ్రవాఙ్మయసౌధమును విమర్శనసుధచే బాగు చేయుటకు "విమర్శకమండలి" లేక "విమర్శకసమితి" యనుపేర నొకమండలిని స్థాపించి దానిలోఁ గనీసము తాలూకా కొక్కరేని సభ్యులుగ నుండి, ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక, భారతీపత్రిక మున్నగు విద్యావిషయక పత్రికలయందు విమర్శనకుఁ దగు స్థలమును బత్రికాధిపతులదయచే సంపాదించి యథార్థమును బయలుపఱుచుటకై సమమగు దృష్టితో గ్రంథముల విమర్శించి నియమితకాలముల సభలను గావించుచు సభ్యులందఱిచేతను బరిష్కృతమైన పిదప వానిని బ్రకటించుచుండవలయును. ఇందులకుఁ దగునిబంధనలు మున్నగునవి సముచితమయిన రీతి సభ్యులొకటొకటిగ నాలోచించి సిద్ధముచేయవచ్చును. తామీవిషయమై తగు శ్రద్ధవహించి యాలోచనసభలఁ గావించుచుఁ, గార్యముల నిర్ణయించి యాంధ్రభాషామతల్లికాసేవకుఁ గొంతకాలము వ్యయపఱుపక తీరదని యీకార్య మవశ్యకర్తవ్య మని పలుమాఱుఁ బ్రార్థించుచున్నాను.

మనుచరిత్ర విమర్శనము.

కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిగారు.

[గతసంచికశేషము]

దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులవారు:—సుప్రసిద్ధ దినాంధ్రపత్రికారాజమును, భారతి యను మాసపత్రికాతల్లజమును బ్రచురించుచున్న గొప్ప భాషాభిమానులు "ఆంధ్రవాఙ్మయసూచిక" అను నుద్గ్రంథమును వ్రాసి ప్రచురించి యందుఁ బెద్దనార్యునిగూర్చియును, నాతని మనుచరిత్రమును గూర్చియును నిట్లు లిఖించియుండిరి.

విశ్వశ్రేయస్సునకు సాధనమైన కావ్యప్రయోజనమును రాజాశ్రయము సంకుచితము చేసినది. శుద్ధశ్రోత్రియుఁడైన ప్రవరాఖ్యుఁడు నిమిత్తమాత్రుఁడు. శిష్టాచారపరాయణుఁడైన ప్రవరాఖ్యుఁడు నిరవలంబనుఁడు. నిస్సహాయుఁడు. ప్రవరాఖ్యుఁడు ప్రకటించిన ప్రధానమైన శాంతరసమునకు గావ్యమునం దప్రధానస్థానమును, వరూథినివరించిన కామాయత్తమైన శృంగారరసమునకుఁ బ్రధానస్థానమును గల్గినవి. ఇందువలననే కవి "బుద్ధిజాడ్యజనితోన్మాదుల్ గదా శ్రోత్రియుల్" అని వ్రాయవలసివచ్చినది. కావ్యమంతయునుఁ గామపరమై కావ్యప్రయోజనమును సంకుచితముచేసినది. తిక్కనపోతనాదులవలెను, పెద్దన కావ్యనిర్మాణమునకుఁ బరమార్థమును సంకల్పించి యుండలేదు. రాజానుగ్రహమును బ్రజాదరణమును నుదారమైన కావ్యప్రయోజనమును దుస్తరముచేసినవి."

కీర్తిశేషులైన వంగూరి సుబ్బారావుగారు:—వీరాంధ్రభాషాపరిశోధనమును విశేషముగాఁ జేసిన పండితులు. "ఆంధ్రవాఙ్మయచరిత్ర" మను గొప్పగ్రంథమును విరచించి యందుఁ బెద్దనార్యుని మనుచరిత్రమునుగూర్చి యిట్లు వ్రాసిరి.

"ఆయనచేసిన బ్రహ్మాండమైన కార్యము లేదు. మార్కండేయపురాణాంతర్గతమైనకథను మూలముగాఁ దీసికొనెను. కథ పెంచెను. ఎట్లు? శ్రీనాథుని సీసపద్యముల పోకడలను పినవీరన వేటవర్ణనలందలి వివరములును నున్నవి యున్నట్లు లాక్షణికుల యభిమతానుసారమే యాసందర్భములను జేర్చెను. తన యాలోచనలకు భావములకు నీవర్ణనలు కలిపినపుడు వృద్ధియైన కథనే మనుచరిత్ర మనుపేరు పెట్టెను. కాని ప్రథమప్రయత్నమగుటచే వస్త్వైక్యత లేకపో

యినది. ప్రబంధమునకుఁ బట్టుని పెద్దకథను దీసికొనెను. తననూతన ప్రయత్నమునకు భంగము కలుగు నని పెద్దన భయపడి కథావస్తువు నెక్కువగాఁ దీసికొనెను. వేఱు వేఱు కథలఁ గూర్చిన కావ్యముల జంట యైనది. కాని మనుచరిత్ర మేక ప్రబంధము కాలేకపోయినది. అయిన నీపెద్దన్న మహాకార్యోత్సాహసమయమున నాంధ్రు లీలోపమును గనుపెట్టలేదు."

మహారాజశ్రీ పి. చెంచయ్య, ఎం. ఏ., గారును, శ్రీరాజా మంత్రిప్రెగడ భుజంగరావుపంతులు బహద్దర్ జమీందారుగారును:—వీరుగొప్ప విద్వాంసులు. ఉభయులును గలసి యింగ్లీషుభాషలో నాంధ్రవాఙ్మయచరిత్రమును వ్రాసిరి. అందు మనుచరిత్రమునుగూర్చి వీ రిట్లు వ్రాసిరి.

"Unities are lacking and the various parts of the story do not properly articulate. Sweet imagery is meagre though descriptions are delightful and conversations cunningly managed" (అతుకులు సరిగ లేవు. మఱియును వివిధములగు కథాభాగములు విన నింపుగా లేవు. మనోహరోహచమత్కారము తక్కువ. కాని వర్ణనము లానందదాయకముగా నున్నవి. ప్రసంగములు చమత్కృతి కలిగియున్నవి.

పేరుదాఁచుకొనిన ఆంధ్రవాఙ్మయచరిత్రసంగ్రహకారు లిట్లువ్రాసిరి:—"ఈ చెప్పిన సుగుణములు తృతీయాశ్వాసమువఱకె. తరువాత సన్నగిల్లినవి. మనోరమ భయపీడిత యై రాక్షసుండు వెన్నంటి తరుముచున్నను కథనంతయుఁ జెప్పె దైచినది. విద్యలకై భార్యలను జేకొన్నాఁడు స్వరోచి! ఎట్లో సాగినది కథ. కాని వర్ణనావైశద్యము శైలిమాధుర్యము తగ్గలేదు. పదసారళ్యము మాత్ర మించుక మందగించిన దేమో? తుదకు వం డైనది. ప్రబంధముల బురద మెత్తుకొనినది."

బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు:—సుప్రసిద్ధపండితసార్వభౌములగువీ రిట్లు వ్రాసిరి. "ఇందు రసోత్తరముగ రచింపఁబడిన వరూథినీప్రవరవృత్తాంతము మూఁడవయాశ్వాసముతో ముగిసిపోవుచున్నది. నాలవయాశ్వాసమున ఉపక్రమింపఁబడిన స్వరోచివృత్తాంత మాఱవయాశ్వాసములోఁ గొంతవఱకె గలదు. ఆవల స్వారోచిమనువృత్తాంతముతోఁ బ్రబన్ధము ముగింపఁబడినది. ఇట్టివిచ్ఛేదము శ్రోతలకుఁ గొండొకచోట్టుల నిరుత్సాహము గల్పించుచుండును. అందును నిందు సగసగమువఱకు గ్రంథమునఁ బెంపొందిన ప్రవరవరూథినీవృత్తాన్తము విచ్ఛిన్న మై వేఱొకకథలో సంక్రమించిపోవుట యెంతయుఁ బాఠకుల యుత్సాహమును వెన్వడం జేయుచున్నది."

బ్రహ్మశ్రీ వఝ్జల చినసీతారామస్వామిశాస్త్రులవారు:- ఈపండితప్రకాండులు మనుచరిత్రమునందలి తప్పులం గూర్చి యిట్లు వ్రాసిరి.

"స్వారోచిషమనుసంభవమున స్వారోచిషమనువుత్పత్తి యత్యల్పపద్యములతో మాత్రము వర్ణించుటనో, మఱి యేమికారణముననో దానికి మనుచరిత్రమను పేరు రూఢమయ్యెను. "మనుచరిత్రం బందుకొను వేళఁ బురమేఁగఁ బల్లకి తన కేలఁబట్టియెత్తె"నని పెద్దనార్యుఁడే చెప్పియున్నాఁడు. ఈపేరైన సంతగా సరిపడియుండలేదు. స్వారోచిషమనుచరిత్రము సహిత మల్పముగనే వర్ణింపఁబడెను. ఆగ్రంథమునఁ బ్రవరవరూథినీస్వరోచిః ప్రభృతుల వర్ణనమే యధికముగా నున్నది. ఇట్టివస్తైక్యము లేని యాఱాశ్వాసముల మనుచరిత్రమును ధిక్కరించుటకుఁ గావలయు రామరాజభూషణుఁడు దానును నాఱాశ్వాసముల ప్రబంధము రచించి 'వసుచరిత్ర' మని పేరుపెట్టి సకలాశ్వాసములును నాయకవసురాజకథాగుంఫితములే యగునట్లు సందర్భపరిచెను."

పిఠాపురసంస్థానవిద్వత్కవివరు లగు రామకృష్ణకవు లిట్లు లిఖించిరి.

"గీ. మారసకథావిధానముఁ జూఱలాడి, కోదె శ్రీనాథు దెరువులఁ గొల్లఁగొట్టి,
కొఱఁతేఁబడునని కుకవిని గోసరితిట్టి, పెద్దనయొనర్చినట్టి తప్పిదము నిదియె."

మహారాజశ్రీ యడ్లపాటి వేంకటసుబ్బారావుగారు:—వీరు మంచిపండితులు. ఆంధ్రపత్రికాసంవత్సరాదిసంచికలో మనుచరిత్రముం గూర్చి యొకపెద్దవ్యాసమును వ్రాసిరి. అం దిట్లున్నది.

ఈ ప్రబంధమునకు 'మనుచరిత్ర' మనియు 'స్వారోచిషమనుసంభవము' అనియును రెండుపేర్లు గలవు. ఈ ప్రబంధమున కీనామములు సమంజసములేనా? యని ప్రథమమున విచారింతము. కథాభాగమును పరికించిన నీరెండుపేర్లును వివాదాంశములే. గ్రంథముపేరు వినినంతనే అది యంతయును మనువుయొక్క చరిత్రమే యని భ్రాంతి కలుగును. కాని యెంతచదివినను వాని ప్రసక్తియే యుండదు. మనువుచరిత్రమునే తెలిసికొనఁగోరి చదువువారి కెంతయు విసుగు జనింపకమానదు. ఇట్టిస్థితిలో గ్రంథమునకు 'మనుచరిత్ర' మని ఏల పేరుండవలయును. ఉత్తరకథకు నాయిక యగుమనోరమ మనువునకు తల్లి కాదు. అకస్మాత్తుగ తటస్థించిన వనదేవతకును స్వరోచికిని మనువు జన్మించినాఁడు కనుక చరిత్రముతో నంతగా సంబంధములేని జననము చరిత్రకు నామకరణముగా వినియోగించుట బాగుగ లేదు. ఘోరరాక్షసులచేఁ దఱుమఁబడి మనోరమ విశ్రాంతుఁ డగు

రాజును శరణు వేఁడినదికదా! భయవిహ్వలచిత్త యయినమనోరమ స్వరక్షణార్థ మితని నర్థించుటకు బదులుగ తనపుట్టుపూర్వోత్తరముల నేకరువుపెట్టుట యేమంత యుచితము? మఱియును మనోరమనుండి మంత్రము గ్రహించి దానవుని నిగ్రహించినటు లున్నది. ఈ అంశమువలన స్వరోచిశౌర్యమునకు కళంకము కలుగుచున్నది. మనోరమ తనచరితమును ప్రథమముననే చెప్పక దానవునికథానంతరము చెప్పిన నెంతయో రమ్యముగ నుండెడిది. మఱియొక సంశయము కూడ కలుగుచున్నది. దానవుఁడు వెంటాడుచున్నప్పుడు స్వచరితమును జెప్పునంతటి యవకాశ మెట్లు కలిగినదో కదా? మనోరమ చెలికత్తెలు తమతమ విద్యలను స్వరోచి కిచ్చి వానిని వివాహమాడిరి. అనఁగా రాజు విద్య నాశించి వారిని బరిణయమైన ట్లున్నదే కాని ప్రేమచే కా దని తేలుచున్నది.........రాజునకు పక్షిభాష నేర్పినది విభావసి. పక్షులుమాటలాడినపుడు విభావసి యచ్చటనేయున్నది. ఈపక్షుల హేళనను ఆమె గమనింపకుండుట వింతలో మఱొకవింత. ఈకథాసందర్భమును ప్రధానచరిత్రలో చొప్పించుట నిరర్థక మైనది. ఏమనగా నందువలన స్వరోచివర్తన మేమియును మారలేదు." *

శ్రీ టేకుమళ్ళ అచ్యుతరావు ఎమ్. ఏ ఎల్. టి. గారు:—ఇంతయేల పెద్దనార్యుని బూసికొనివచ్చి యస్మదాదులను మనుచరిత్రమునందుఁ గొన్నిదోషములు కూడఁ గల వనినందులకై పెక్కువిధములఁ దిట్టిపోసిన శ్రీరావుగారే తుదకుఁ బెద్దనగారి గ్రంథమునందలి పెద్దదోషములనే యిట్లు గ్రంథస్థము చేసిరి.

—: (1) రసవిషయకలోపము :—

ఈవిషయ మై శ్రీరావుగారు తమ ప్రతివిమర్శనములో ని ట్లధిక్షేపించిరి. "ఈకథయందలి సార మంతయు వరూథినీప్రవరుల యుపాఖ్యానమునందే యున్న దనియుఁ దక్కినభాగ మంతయు, రసోత్సేకము గలుగఁజేయలేని వల్లీబంధ మనియుఁ 'బెద్దనార్యుఁడు, తన లోకోత్తరకావ్యప్రజ్ఞ నంతయు నీయుపాఖ్యానమునందే చూపించె ననియు వారి నమ్మకము. కావునఁ బెద్దనార్యుని కావ్యప్రతిష్ఠ యీయుపాఖ్యానమున నిలిచి యున్నది. ఈభాగము రసమునందును నీతియందును జెడినయెడలఁ బెద్దనార్యుఁడు తలయెత్తుటకు వేఱె యవకాశముండదు."

దీనింబట్టి మనుచరిత్రమునందలి తుదియాశ్వాసత్రయమును రసవిహీన

* వావాదమున కనుకూలించుభాగములనే కొన్నింటి గ్రంథవిస్తరభీతిచే నిందుండిలోఁ గిందితిని.

మైన వట్టివల్లీబంధ మని తేలుచున్నది. ప్రబంధమునందలి సగపాలు రసము లేని వల్లీబంధ మనునది సామాన్యాక్షేపణ మగునా? తుదియాశ్వాసములే కదా స్వారోచిషునిసంభవాదులు కలిగి ప్రధానకథతో నలరారుచున్నవి. అవియే రసహీనము లనినఁ గావ్యము పెద్దరసలోపముకలదై యున్న దని వేఱుగఁ జెప్పవలెనా? రసములేదనక రసములేని వల్లీబంధ మనుట యాక్షేపణము చేయుట కాక మఱేమగును?

—: (2) గ్రంథము దుర్నీతిబోధకమనుట :—

మనరావుగారు మనుచరిత్రము దుర్నీతిబోధకము కా దని ఋజువుచేయుటకై పడఁగల పాట్ల నెల్లఁబడి వింతవాదములఁ గావించి కావించి తుదకీ క్రిందివాక్యములలో నీపొత్తమున దుర్నీతి కల దని యంగీకరించిరి.

“మఱియొకవిషయము:—వరూథిని విరహావస్థయం దుండఁగా సూర్యాస్తమయవర్ణనమునఁ బెద్దనార్యుఁ డాయవస్థ నిట్లుత్ప్రేక్షించెను.

“చ. తరుణి ననన్యకాంత నతిదారుణపుష్పశిలీముఖవ్యథా
భరవివశాంగి.................................దీక్షతిన్.”

ఈపద్యమునందలి భావము జారత్వబోధకమని శ్రీ శాస్త్రిగారాక్షేపించిరి. ఇది న్యాయమైన యాక్షేపణయే. పెద్దనార్యుం డిచట నిక్కముగఁ బెద్దతప్పుఁ జేసినాఁడు. ఇది కవియభిప్రాయమునే సూచించుచున్నది. కాని, పాత్రోచితవాక్యము కాదు. పెద్దనార్యుని శృంగారరస మిచటఁ బొంగిపొరలినది. శ్రీ శాస్త్రిగారి చీవాట్లకుఁ బెద్దన్న యిచ్చటఁ దప్పక యర్హుఁడే.”

దీనింబట్టి పెద్దన్న నీతికి విరుద్ధ మగువ్రాఁతల నీసందర్భమున వ్రాసె నని తేలుచున్నది. వేశ్య యనన్యకాంతకావున దానింగూడుట తప్పుకాదనియు, దాని మోహమును దీర్పకుండుటయే తప్పనియుఁ బ్రవరుఁ డట్లుదానిఁ గూడక త్రోసివేసెను, గావున, నధముఁడై నాఁ డని యు నిందుఁ దెలుపఁబడియున్నది. వేశ్యను గూడుట తప్పేయని మార్కండేయపురాణము నొక్కివక్కాణించుచుండఁగా మనకవి దానికి వ్యతిరేకముగాఁ జేసిన యీబోధ దుర్బోధయే యని యంగీకరింపనివారుందురా? ఇచటఁ బెద్దనార్యుఁడు పెద్దతప్పే చేసినాఁ డని రావుగారే యుద్ఘోషించుచున్నారు. ఈరీతిగా నీతిమార్గమునుండి మరలి కవి దుర్నీతిని బోధించుటకుఁ గారణముకలదు.

—: (3) అసంగతప్రసంగముచేయుట :—

ప్రవరుని వేషమును ధరించి వరూధినిని మోసగించి యామెంగూడి తాను జిరకాలమునుండి యాశించుచున్న కోర్కెను దీర్చుకొనుటకై నిశ్చయించుకొని గంధర్వాధముఁడు పలికినపలుకులు సందర్భశూన్యముగానే యున్న వని రావుగారును లిఖించిరి. వీనినిబట్టి మనుచరిత్రమునం దున్నది పండితు లొల్లని పశుశృంగారం బనియు నీగ్రంథమును వ్రాయుట లోఁ గవి యుదారభావములు పెట్టుకొని యుండక విశ్వశ్రేయస్సునకు మూలమయిన కావ్యధర్మమునే పాడుచేసె ననియు, గ్రంథము దుర్నీతిబోధక మనియుఁ గథాసందర్భము పాత్రౌచిత్యము రసస్ఫురణము చెడిన వనియుఁ దేలుచున్నది.

మఱియును గురుజాడ శ్రీరామమూర్తిగారు తమకవిజీవితములలో మనుచరిత్రమునందుఁ బ్రబంధమునం దుండవలసిన ప్రౌఢత లేదనిరి. మహోపాధ్యాయ వేదము వేంకటరాయశాస్త్రులవా రాముక్తమాల్యదాపీఠికలో దీనిపాకము పాషాణతుల్య మనిరి. కవికులతిలకు లగుదేవులపల్లి నృసింహశాస్త్రులవారు, కోపల్లి రమణారావుగారు దీనియం దనేకదోషముల నెంచిరి. మహేంద్రవిజయపీఠికాకారులు, ఇతివృత్తము సరిగ లే దనియు గ్రంథనామమే చెడిన దనియుఁ దేల్చిరి. కవిశేఖర వసురాయకవిగారు లోనగువారు "కొఱఁతకబడుట" మున్నగు ప్రయోగము లసాధువు లనిరి. తప్పు లున్నయప్పుడు వాని నెంచుటయు ను గలుగును. ఇంకను ననేకఖండనములు కలవు, కాని, గ్రంథవిస్తరభీతిచే వానింగూర్చి ముచ్చటింపక విడుచుచున్నాను. ప్రాచీనులలో రామరాజభూషణాదులు పెద్దనార్యుని కథాసంవిధానాదులు ప్రౌఢముగా లే వని తేల్చినట్లు రసికులు చెప్పుదురు.

వీనింబట్టి పండితలోకాభిప్రాయము నాచేసినయాక్షేపణముల కనుగుణముగానే యున్న దనియు నాది విలక్షణమైన విమర్శనము కా దనియుఁ దేలుచున్నది.

ఆంధ్రసారస్వతప్రపంచమున నీరీతిఖండనములు మెండుగ వెలయుచుండఁగ, మనరావుగారు మనుచరిత్రముపై ఖండనమును వ్రాసినవాఁ డొక్కఁడె యీ ప్రతివాదియే యని లిఖించుట లోకవంచనము చేయుటకాక మఱేమగును? నన్ను నిందించుటలో సత్య మెట్లుండఁగలదు? లోకమంతయు మెచ్చుకొనుటయు, నేనొక్కఁడనేఁ దప్పులు పట్టుటయుఁ దటస్థించిననే "అరిస్టయిడీసు" కథ నాకన్వయించును, కాని లేకున్న నాకన్వయింప దని లోకము గ్రహించుకొనవలసియుండును.

పైపండితప్రకాండులు దోషములనే కాక గుణములఁగూడఁ దమవిమర్శన

ములలోఁ జూపియున్నారు. నీవిమర్శనమునను నీవు మనుచరిత్రములో దోషము లున్నట్లు నిరూపించితివే కాని గుణములున్నట్లు తెలుపలేదు, కావున, నీవు నిందార్హుఁడవే యందురా యనఁదగదు. విమర్శకు లందఱవలెనే నేనును గుణదోషముల రెండింటినిఁ గూడఁ జూపితిని గాని యొక్క దోషములమాత్రమే చూపియుండలేదు. నావిమర్శన గ్రంథములో గుణపరిగణనమునుజాలఁగలదని నేనిదివఱకే వ్రాసియున్నాను. మఱియు శ్రీరావుగారు కొన్నిచోట్ల నేను జూపిన దోషములు నిజమైన దోషములు గానే యున్న వని యంగీకరించిరి. కొన్ని నేనెంచినదోషములు నాకు దోషములుగాఁ గాన్పించినను వారి కట్లు గాన్పింపనంతమాత్రమునఁ బ్రతివాదిని దుర్భనిందల పాలుచేయఁ జూచుటయు ను, పరిహాసపాత్రుని జేయ నుద్యమించుటయును సద్విమర్శకున కుచితమైన పని గాదు. కొన్నిట భేదాభిప్రాయము గలిగినంతన దుర్వృత్తి నారోపించుట మఱింత తగదు. సందర్భరహితముగా "అరిస్టయిడీసు" యొక్కయు, పౌరునియొక్కయు కథనెత్తికొని నన్నుఁ బరిహాసింపఁజూచుటను గన నాకును నొకకథ జ్ఞప్తికి వచ్చుచున్నది. పూర్వ మొకప్పు డొకపాఠశాలలో గురు వొకశిష్యుని "పంద్రెండెనిమిదు లెంత" యని ప్రశ్నించె. నూటతొమ్మిది. యని శిష్యుఁడు సమాధానముచెప్పె. పంద్రెం డెనిమిదులు తొంబదియాఱని నేనీకనేకపర్యాయములు చెప్పితినే యది నీకు జ్ఞాపకములేదా? యని గురుఁడు ప్రశ్నించె. జ్ఞాపకమున్నదికాని మీ రింకొకప్పు డేదేని విషయము తేల్పవలసివచ్చినప్పుడు సదా పరబుద్ధినే నమ్మకొనఁగూడ దనియు, స్వబుద్ధిని ముఖ్యముగా వినియోగించి సిద్ధాంతము చేయఁ బ్రయత్నింపవలయు ననియు నొక్కి చెప్పియున్నారు కాఁబట్టి మీమాటల మీఁదనే యాధారపడక నాబుద్ధిని వినియోగించి నూటతొమ్మిది యని చెప్పితి నని శిష్యుఁడు ప్రతివచన మిచ్చె. మన శ్రీరావుగారిగమనిక యాశిష్యునిగమనికను బోలియున్నది. మనుచరిత్రమును విమర్శించుటలో సుప్రసిద్ధపండితలోకము త్రొక్కినమార్గమును ద్రొక్క నొల్లక శ్రీరావుగారు స్వబుద్ధినే ప్రమాణముగాఁ గొని క్రొత్తమార్గము త్రొక్కి తుదకు హాస్యాస్పదములగు సిద్ధాంతములఁ జేయఁ జొచ్చిరి. ఇదియా మచ్చువిమర్శనము. వ్రాయువాని క్రమము? నావ్రాసినదానిని ఖండించివేయుదురుగాక ! నాపై ద్వేషము పూను టేల? ఎట్లైన నన్ను నిందలపాలుచేయఁజూచు టేల? తుదకుఁ దామే పరిహాసపాత్రులు గారా?

వాదమునిమిత్త మిదివఱ కెవరును మనుచరిత్రమువందలి దోషములను జూపుటకుఁ బ్రయత్నము చేయలేదనియు, నాదియే ప్రథమప్రయత్నమనియు సంగీత

రింతము. ఇదివఱ కెవరును దోషములను జూపకుండినంతమాత్రమున నే నెంచిన దోషములు దోషములు కాకపోవునా? వంగూరి సుబ్బారావుగారు చెప్పినట్లుగా, ప్రబంధనిర్మాణములో మనుచరిత్రము మొదటిది గావునఁ గ్రొత్తగఁ బ్రబంధము పుట్టిన దను నుత్సాహములో మునిఁగిపోయి, లోకు లందలి దోషములనుగ్రహించుకొను స్థితిలోనికి రాకపోవచ్చును. ఇటీవలఁ బరిశీలన మెక్కుడయిన తరువాతనంనఁ గాన్పించుదోషముల నిరూపించి చూపరాదా? తిన్నగఁ జూడక లోకము మొదట మెచ్చుకొనినంతమాత్రమున గ్రంథమునందలి దోషములు గుణములై పోవునా? తొల్లియాంగ్లేయులలో "మాంట్యాగ్యుమఱ్ఱి" యనునొక కవిసామాన్యుఁ డుండెడివాఁడు. ఆతఁ డనేక కావ్యములను వ్రాసినాఁడు. సరిగఁ బరిశీలించి చూచుకొనక యాకావ్యముల లోకము మెచ్చుకొనఁజొచ్చినది. ఇట్టిప్రఖ్యాతి గలిగినపిమ్మట "మెకాలే" యనువిమర్శకుఁడు బయలువెడలి యాకావ్యములు కుకవిత్వదూషితము లని ఋజువుచేయుచు ఖండనముల వ్రాసెను. వానిం జదువుకొని లోకము సత్యజ్ఞానము సంపాదించుకొని "మాంట్యాగ్యుమఱ్ఱి" గ్రంథములనుజూచుటమానె.

అంతియే కాని యిదివఱకెందఱును మెచ్చుకొనుచుండఁగ నేఁడు నీవొక్కఁడవే బయలువెడలి మాంట్యాగ్యుమఱ్ఱి గ్రంథములపై ఖండనములు వ్రాసితి వనియు, కావున నవి యగ్రాహ్యము లనియు, మెకాలేపండితుని నిందింప నెవరును సాహసింపలేదు. మెకాలేవ్రాఁత లందఱికిని గ్రాహ్యములే యైనవి. కావున నీవు నేఁడు బయలుదేఱి మనుచరిత్రముపై దోషముల నెంచిన వానినొప్పుకొన మనరాదు. అట్లనుట సద్విమర్శకధర్మము కాదు. మెకాలే, మాంట్యాగ్యుమఱ్ఱి కుకావ్యములు ప్రసిద్ధికి వచ్చుచున్నవిగాన నే ఖండనము వ్రాసితినని. దోషములు గుణములుగా నెంచఁబడుస్థితిలోనికి వచ్చినప్పుడు తప్పకఖండనములుండవలెను. కాన మనుచరిత్రముపై మండనమేకాక ఖండనము వ్రాయవలసివచ్చిన దని రావుగారు తెలిసికొనవలెను. పెద్దనార్యుని గ్రంథమునందు దోషము లున్న సంగతినే తలపెట్టక కేవలస్తుతిపాఠములతోఁ దమవిమర్శనముల నింపినవారు శ్రీ వె. రామచంద్రరావు పంతులుగారు మున్నగువారు కలరు. వీరుదోషములనుగూడ గుణములనుగానే యేదో యొకవిధముగా మనస్సును తృప్తిజేసికొని వ్రాసివేసిరి- లోకమును దప్పుత్రోవలఁ బెట్టు నిట్టివిమర్శనాభాసములు బయలువెడలుటచేతనే సత్యనిర్ధారణార్థమై నేను విమర్శనమును వ్రాయఁ బూనుకొంటినని యిదివఱకే వ్రాసియున్నాను.

రుయ్యకునికృతులు.

—:యీయుణ్ణి వేంకటవీరరాఘవాచార్యులుగారు, యం. ఏ., కాకినాడ:—

రాజానకరుయ్యకుని జన్మాదికమును గాలమును గుఱించి క్రిందటిసంచిక [23 వ సంపు. 1 సంచిక] లోఁ జర్చించియున్నాఁడను. ఈవ్యాసమున నాతని గ్రంథములంగూర్చియు, రానున్నవ్యాసములలో నాతని 'యలంకారసర్వస్వము'ను గూర్చియుఁ, దద్వ్యాఖ్యలం గూర్చియు వివరింపఁబడును. ఇతఁడు పదియలంకారగ్రంథముల రచించె ననియు నిన్ని యలంకారగ్రంథముల నన్యు లెవరును రచించియుండ లేదనియు నిదివఱలోఁ దెలిసికొనియున్నాము. కాని సాహిత్యసాగరమును మథించి దృఢవ్యుత్పత్తినందిన యీమహనీయుని కృతిప్రసూనములలో నేఁటివఱకు సూర్యాలోకముం బడసినవి మూఁడుమాత్రమే కల వని చెప్పుటకు విచారించుచున్నాఁడను. తక్కిన గ్రంథరాజము లుత్సన్నకల్పము లనియే యెంచ నగును. ఇఁక నాతనిగ్రంథముల నన్నిటి నకారాదిక్రమమున వివరింపఁ గడంగెద.

I. అలఙ్కారమఞ్జరి :—దీనిని రుయ్యకుఁడే తన 'యలంకారసర్వస్వము'[1]న సూచించియున్నాఁడు. 'తత్ర రసాదిధ్వని రలఙ్కారమఞ్జర్యాం దర్శితః' [15 పు]. దీనిని గుఱించి ప్రకృత మింతకంటె నేమియుఁ దెలియదు. ఇందు శబ్దార్థాలంకారములు వివరింపఁబడియుండు ననుకొందును. సుఖలాలపండితుఁ డొక 'యలంకారమంజరి'ని రచించినట్లు తెలియుచున్నది.[2] కాశీనివాసి యగు త్రిమల్లభట్టు 'అర్థాలంకారమంజరి' యను నామాంతరముగల 'యలంకారమంజరి'[3] యనుకృతిని రచించెను. దీనికి సుధీంద్రయతి 'మధుధార' యను వ్యాఖ్యను రచించెను.

II. అలఙ్కారవార్త్తికము :—దీనిని రుయ్యకుఁడు రచించినట్లు జయరథుఁడు 'విమర్శిని' (అలంకారసర్వస్వవ్యాఖ్య) లో సూచించియున్నాఁడు. 'అనే నైవ చాశయే నాత్రాలఙ్కారవార్త్తికే గ్రంథకృతా వైశిష్ట్య మస్య దర్శితమ్.' [71 పు].

III. అలఙ్కారసర్వస్వము :— సూత్రవృత్త్యాత్మక మగు నిది యీతని కృతులలో నగ్రగణ్యము. ఇది బొంబాయి 'కావ్యమాల' లోను, 'తిరువనంతపుర సంస్కృతగ్రంథావళి' లోను వ్యాఖ్యానములతోఁ బ్రకటింపఁబడినది. దీనిమీఁది విమర్శనము రానున్నవ్యాసములో సమగ్రముగఁ గననగును. దీనికి జయరథుఁడు [విమర్శిని], సముద్రబంధుఁడు [శబ్దనిబంధనము], విద్యాచక్రవర్తి [అలంకారసం

1. నిర్ణయసాగరముద్రితము.
2, 3. పాండురంగవామనకాణే: 'అలంకారవాఙ్మయచరిత్ర.' CLXI పు.

జీవని]యు వ్యాఖ్యలు రచించియున్నారు. మఱియుఁ గోవమిశ్రకృతమగు 'సలం కారసర్వస్వ' మొకటి కలదు.[4] గ్రంథకర్తనామము తెలియని మఱొక 'యలంకారసర్వస్వము' గలదు. ఈయజ్ఞాతగ్రంథకర్తగురువుకూడ గోపాలదేవునికిఁ గృతిగా నొక 'యలంకారసర్వస్వము' ను రచించినట్లు తెలియుచున్నది.[5]

IV. అలఙ్కారానుసారిణి :—ఇది రుయ్యకకృతముగా జయరథునిచే నాలుగుసారులు పేర్కొనఁబడియున్నది.

(i) 'గ్రంథకృతా ప్యలంకారానుసారిణ్యా మత్ర శ్రద్ధాహేతుత్వా చ్ఛ్రద్ధే త్యభిధాయావిశేషే న్నైకస్మి న్ననేకవస్త్వారోపా న్మాలారూపక మి త్యభిదధతాయ మేవ పక్షః కక్షీకృతః' [36 వ పు.]. అధోరేఖాంకితమగు పైపదమునకుఁ గావ్యమాలాసంపాదకు లగు, మ. మ. దుర్గాప్రసాదపండితులు, కాశీనాథసూరియు 'కాశ్మీరకమహాకవిజల్హణప్రణీతసోమపాలవిలాసకావ్యటీకాయాం' అని యధోజ్ఞాపిక వ్రాసియున్నారు. కాని 'అలంకారానుసారిణి' జల్హణుని 'సోమపాలవిలాసము'[6] నకు వ్యాఖ్య యనుట భ్రమప్రమాదజనిత మని ముందు తెలియఁగలదు.

(ii) 'ప్రాయః శబ్దేనచ హేతుఫలయోః కుత్రాపి సంభవో౽స్తీతి దర్శితమ్. అతఏవాలంకారానుసారిణ్యాం గ్రంథకృతానయోరపి సంభవో దర్శితః.' [57 పు].

---

4. 'అలంకారశేఖరము'నందలి పీఠికలోని మూఁడవశ్లోకమును బట్టి తత్కృతికర్తయగు కేశవమిశ్రుఁడు 'అలంకారశేఖరము'ను రచించుటకుఁ బూర్వము పండితోపకారకము లగు నేడుగ్రంథముల రచించినట్లు తెలియుచున్నది. ఈయేడుగ్రంథములలో 'అలంకారసర్వస్వము' ను [9; 38 పు] 'కావ్యరత్నము'ను [12 పు] మాత్రమే యాతఁ డిటఁ బేర్కొని యున్నాఁడు. 'కావ్యరత్నే' [12 పు] అనునది 'కావ్యరత్నే' యనుట కపపాఠము కానోపు.

5. కాణే: 'అలంకారవాఙ్మయచరిత్ర.' CLXII పు.

6. జల్హణునిగూర్చి యించుక: మంఖుకుని 'శ్రీకంఠచరితము'లో [XXV స. 75 శ్లో.] జల్హణమహాకవి యభివర్ణింపఁబడెను. కాశ్మీరదేశములోని రాజపురీప్రభు వగు సోమపాలుని చరిత్రియే జల్హణుఁడు కావ్యముగా రచించియున్నాఁడు. ఈసోమపాలుఁడు కాశ్మీరాధినాథుఁడగు సుస్సలభూపతితో యుద్ధము చేసినట్టులు 'రాజతరంగిణి' [VIII త. 621 శ్లో. వలనఁ దెలియుచున్నది. క్రీ శ. 12 వ శతాబ్దములోఁ బూర్వార్థమున విలసిల్లిన యీజల్హణకవి, 'సూక్తిముక్తావళీ' సంధాతయుఁ, దక్షిణాదిశకశతాబ్దోత్తరార్థమున నుండిన ఆరోహకభగదత్తజల్హణదేవునికంటె భిన్నుఁడని యెఱుఁగునది. కాని 'ఔఫ్రెట్' పండితుఁడు 'సోమపాలవిలాసము'నుగూడ భగదత్తజల్హణదేవునకే యారోపించెను. [Catalogus Catalogorum. I సం. (208 a)]. కాని యదిసరి గాదు.

(iii) "లక్ష్యే భేదనిర్దేశ ఇతికార్యః. తస్యాశ్చాష్టచత్వారింశద్భేదాః సంభవన్తి. తదుక్త మలంకారానుసారిణ్యామ్'' 'ప్రతీయమానోత్ప్రేక్షా భేదా అష్టచత్వారింశత్' ఇతి'' [58 పు]

(iv) "ఏవం 'అపరః పాకశాసనో రాజా' ఇత్యత్రాపి దృఢారోపమేవ రూపకమ్. ఏత చ్చాలంకారానుసారిణ్యా ముత్ప్రేక్షావిచారే గ్రంథకృతైవ దర్శితమ్" [60 పుట]

రత్నకంఠుఁడు 'సారసముచ్చయము'లో మమ్మటుని 'కావ్యప్రకాశము' పై వ్యాఖ్యానములఁ జేర్కొనియున్నాఁడు. ఈ 'సారసముచ్చయము'యొక్క యొకానొకవ్రాఁతప్రతిలోని యాకరముంబట్టి కావలయును రుయ్యకుని 'యలంకారానుసారిణి' జల్హణుని 'సోమపాలవిలాసము'ను మహాకావ్యమునకు వ్యాఖ్యగాఁ దెలియుచున్న దని 'పీటర్సన్' పండితుఁడు [Prof. P. Peterson] వల్లభదేవుని 'సుభాషితావళికి'ఁ దాను రచించినపీఠికలో [106 పు.] వ్రాసియున్నాఁడు. 'జాకోబీ' పండితుఁడు [Prof. H. Jacobi] కూడ నిట్టియభిప్రాయమునే వ్రాసియున్నాఁడు.[7]

'తథాహి కవివర జల్హణకృతే సోమపాలవిలాసే...... అస్యార్థః శ్రీరాజానకరుచకవిరచితాయా మలంకారానుసారిణ్యామ్' అని రత్నకంఠుఁడు [క్రీ. శ. 1681] 'స్తుతికుసుమాంజలి' [VIII-19] లో రచించిన వాక్యములంబట్టి 'అలంకారానుసారిణి' జల్హణుని 'సోమపాలవిలాసము'పై వ్యాఖ్య యని 'ఔఫ్రెట్'పండితుఁడు [Prof Aufrecht] కూడ భ్రమపడియున్నాఁడు.[8] పైనుదాహరించిన జయరథుని వాక్యములంబట్టి 'అలంకారానుసారిణి' ప్రత్యేక మగు నలంకారగ్రంథమనియు, నందు మాలారూపకము, నలువదియెనిమిదివిధము లగు ప్రతీయమానోత్ప్రేక్ష మొదలగుకావ్యాలంకారములు సమగ్రముగఁ జర్చింపఁబడినట్లులే స్ఫురించుచున్నది కాని, యం దెందు నాగ్రంథము 'సోమపాలవిలాసము'నకు వ్యాఖ్య యనుట కావంతయు నాధారము గానవచ్చుటలేదు. కేవల వ్యాఖ్యామాత్రమే యగుచో 'నలంకారానుసారిణి'యం దీవిషయము లింతకూలంకషముగా సమాలోచింపఁబడి యుండుట కవకాశ ముండదు. కావున 'అలంకారానుసారిణి' జల్హణుని 'సోమపాలవిలాసము'పై వ్యాఖ్యయనుట సరికాదు.[9]

---

7. Z. D. M. G. LXII. 291.

8. 'Catalogus Catalogorum,' I. 32 b.

V. కావ్యప్రకాశసంకేతము[9]:— అలంకారశాస్త్రమున నానందవర్ధనాచార్యులు, మమ్మటాచార్యులు, జగన్నాథపండితరాయలు త్రిమూర్తులవంటివారు. అందు మమ్మటుని 'కావ్యప్రకాశము'నకు వచ్చిన ప్రతిష్ఠ మఱియేయలంకారగ్రంథమునకు రాలే దని చెప్పవలయును. దీనికి వ్యాఖ్యానములు, (వ్యాఖ్యానములకు వ్యాఖ్యానములును) కనీసము డెబ్బది యున్నట్లు తెలియుచున్నయది. వీనినిగూర్చి ముమ్ముందు ప్రత్యేకవ్యాసము వ్రాయఁబడును. సంస్కృతవాఙ్మయములో నెట్టియు గ్రంథమునకును నిన్ని వ్యాఖ్యలు లేవు. కాళిదాసుని మేఘదూతకు మాత్ర మేఁబది వ్యాఖ్య లున్నట్లు తెలియుచున్నది. మొన్న మొన్నఁటివఱకు నుండిన మల్లాది లక్ష్మణసూరి 'కావ్యప్రకాశము'న కొకవ్యాఖ్య రచించెను. నైయాయికు లేమి, వైయాకరణులేమి మఱి యే యితరశాస్త్రమునందు ప్రగాఢవైదుష్యమును సంపాదించిన పండితు లేమి, భారతవర్షమున వివిధప్రాంతములందలి పండితులు దీనికి వ్యాఖ్యలు రచించియున్నారు. నేఁడు 'భట్టాచార్య'బిరుదము (Ph. D.,) నకుఁ బరిశోధనగ్రంథము (Thesis) ను రచియించినట్లు, నాఁడు 'కావ్యప్రకాశము'నకు వ్యాఖ్య వ్రాయ సమర్థుఁడగువాఁడే యాచార్యబిరుదమున కర్హుఁడుగా నెంచఁబడియుండును. అందువలన దీని కిన్నివ్యాఖ్యలు వ్రాయఁబడియుండును. దీనివ్యాఖ్య లింక నెన్ని యుత్సన్నము లయ్యెనో! సుభాషితగ్రంథములవలెనే యిట్టివ్యాఖ్యలవలన, విస్మృతినందినకవులును నుత్సన్నము లగుననేకగ్రంథములును మనకుఁ దెలియుచున్నవి. ప్రకృత మగు 'కావ్యప్రకాశసంకేతము' మమ్మటుని 'కావ్యప్రకాశము'నకు వ్యాఖ్య-ఇది రుయ్యకకృత మని జయరథుఁడు వ్రాసియున్నాఁడు.

---

9 'కావ్యప్రకాశము' వీనను నీ 'సంకేతవ్యాఖ్య'తోడను, మఱియైదు ఇతరవ్యాఖ్యలతోడను డాక్టర్ యస్, సుక్థంకరుపండితుఁడు, (M A., Ph D.,) కొంతకాలముక్రిం ప్రచురించియున్నాఁడు. రుయ్యకునివంటి దిగ్దంతి వ్రాసిన యీవ్యాఖ్య సమగ్రముగ నెన్నఁడు ప్రచురింపఁబడునో యని యెదురుచూచుచున్నాము. ('Kavyaprakasa' Ullasas I, II, & III with five Commentaries, edited with an Introduction, English translation & Explanatory Notes-by S. S. Sukthankar. The Bombay Book Depot, Girgam, Bombay 1933; Vide 'Indian Historical Quarterly'- Vol. X No. 2; P 376-7; June 1934) ఈ సంపుటమున (1) రుయ్యకుని 'సంకేతము,' (2) నరహరిసరస్వతీతీర్థుని 'బాలచిత్తానురంజని,' (3) గోవిందఠక్కురుని 'ప్రదీపము,' (4) నాగేశుని 'ఉద్ద్యోతము,' (5) వైద్యనాథుని 'ప్రభ' అను నైదువ్యాఖ్యానములు గలవు.

'యత్తు కావ్యప్రకాశసంకేతగ్రంథకృతా వస్తుధ్వనేః శబ్దశక్తి మూలత్వం చిన్త్య ముక్తం తదుదాహరణాభిప్రాయే ణైవో న్నేయమ్' [102 పు.] రత్నకంఠుఁడు కూడ నిట్టులే యుదాహరించియున్నాఁడు. 'కావ్యప్రకాశసంకేతము'నందలి పీఠికా శ్లోకము [2 శ్లో] లో నీగ్రంథకర్త తాను తిలకునియొద్ద నలంకారశాస్త్రము నధ్యయన మొనరించినట్లు వ్రాసికొనియున్నాఁడు. ఈవ్యాఖ్యాతయు (రుచకుఁడు) మన రుయ్యకుఁడు నొక్కఁడే.

'కావ్యప్రకాశసంకేతము' వ్రాఁతప్రతిలో మొదటియుల్లాసము చివర—

'ఇతి శ్రీమద్రాజానకామల్ల మమ్మట రుచకవిరచితే నిజగ్రంథకావ్యప్రకాశసంకేతే ప్రథమఉల్లాసః' అనియు, దశమోల్లాసము తుదను 'కృతీ రాజానక మమ్మటాలక రుచకానాం' అనియుఁ గానవచ్చుచున్నది. 'కావ్యప్రకాశ'వ్యాఖ్యానములలో మాణిక్యచంద్రుని 'కావ్యప్రకాశసంకేతము' మొదటిది. సోమేశ్వరుఁడు, సరస్వతీతీర్థులు, జయంతుఁడు రచియించిన వ్యాఖ్యలును బ్రాచీనములే. క్రీ. శ. 15 వ శతాబ్దిలో విలసిల్లిన గోవిందఠక్కురుని 'కావ్యప్రదీప'వ్యాఖ యపారపాండితీద్యోతకముగా నున్నది.

VII నాటకమీమాంస:—మహిమభట్టుని 'వ్యక్తివివేకము'[10]నకు వ్యాఖ్యయగు 'వ్యక్తివివేకవిచారము'లో వ్యాఖ్యాత [యగురుయ్యకుఁడు] ఈ 'నాటకమీమాంస' స్వోపజ్ఞోద్భాతముగాఁ బేర్కొనియున్నాఁడు.

VII బృహతి:—'వ్యక్తివివేకవిచారము' [45 పు.] ననుసరించి, తన్నిర్మాత [రుయ్యకుఁడు] 'బృహతి' యనునొకవిపులగ్రంథమును రచింప సమకట్టియుండె నని స్ఫురించుచున్నది. ఈగ్రంథమే పూర్తిగ రచియింపఁబడి మనకు లబ్ధమగుచో నలంకారాహవరంగమున మహారథుఁ డగు రుయ్యకునంతవానిచే నలంకారశాస్త్రగ్రంథ మ లనేకములు విడఁగొట్టఁబడియుండెడివే.

VIII వ్యక్తివివేకవిచారము:— అలంకారసర్వస్వమునందలి వృత్తిని నిర్మించిన యాతఁడే [రుయ్యకుఁడే] 'వ్యక్తివివేకవిచారమ'ను కృతిని రచించినట్లు

---

10. 'అస్యచ విధేయావిమర్శ స్యాఽనేకతరప్రసిద్ధ లక్ష్యసాతిశ్వే నాస్మాభి ర్నాటకమీమాంసాయాం సాహిత్యమీమాంసాయాంచ తేషు తేషు స్థానేషు ప్రపఞ్చః ప్రదర్శిత ఇతి గ్రన్థవిస్తరభయాదిహ ఏ నోపదర్శ్యతే'. [32 పు.]

'అస్మాభి స్త్వేతత్ ప్రపఞ్చో బృహత్యాం కరిష్యతే' [45 పు. 'దర్పిణమాపది' అను శ్లోకమునకుఁ బిమ్మట.]

జయరథుఁడు తన 'అలంకారసర్వస్వవిమర్శిని'లో సూచించియున్నాఁడు.[11] మహిమభట్టుని [1020—60. క్రీ. శ.] 'వ్యక్తివివేకము'నకు వ్యాఖ్య యగు పై 'వ్య. వి. వి' అసమగ్రముగఁ బ్రచురింపఁబడినది.[12] ఈవ్యాఖ్యాత పేరు తెలియుటలేదు. కాని యితఁడు రుయ్యకుఁడే యనుటకుఁ బ్రబలప్రమాణములు లభించుచున్నవి' వ్యక్తివివేకవ్యాఖ్యాత తాను 1. 'హర్షచరితవార్త్తికము'ను[13]

2. 'బృహతి'[14]

3. 'సాహిత్యమీమాంస'[15]

4. 'నాటకమీమాంస'[16] యనునలంకారగ్రంథములను నిర్మించినట్లు చెప్పికొనియున్నాఁడు. ఈగ్రంథములలో, 'నాటకమీమాంస'ను వ్యక్తివివేకవ్యాఖ్యాతయే నిర్మించినట్లును, అతఁడే 'బృహతి'ని గూడ రచింపసమకట్టినట్లును వ్రాసియున్నాను. ఇఁక నింకఁ బేర్కొనఁబడిన 'హర్షచరితవార్త్తికము'ను 'సాహిత్యమీమాంస'యును రుయ్యకకృతములుగా 'అలంకారసర్వస్వము'లో నుదాహరించుకొనఁబడియున్నవి.[17] (రుయ్యకునివంటి యాలంకారికచూడామణి) పై రెండు గ్రంథములు నితరకవికృతములే యగుచో వానిని స్వనిర్మితము లని తన గ్రంథమునఁ బేర్కొనసాహసించునా! వ్యక్తివివేకవ్యాఖ్యనుండియు, నలంకారసర్వస్వమునుండియుఁ బ్రకృత ముదాహరింపఁబడిన పంక్తులసామ్యమును బట్టి యీరెండుపంక్తులును [దీనింబట్టి పై రెండుగ్రంథములును] ఏకకర్తృకము లని తెలియుచున్నది.

---

11. "వాచ్యస్య ప్రతీయమానేన తాదాత్మ్యం తదుత్పత్త్యభావాది నేహ ప్రతన్యత ఇతి వ్యక్తివివేకవిచారే హి మయైవ తద్వ్యతిరేకస్య నిర్ణీతమితి భావః" [అలం. సర్వ. 13 పు.]

12 'అనన్తశయనసంస్కృతగ్రన్థావళి, 5 వసంఖ్య. త గణపతిశాస్త్రిసంశోధితము. (Trivandrum 1909.)

13. "ఏతదస్మాభిః హర్షచరితవార్త్తికే విస్తృత్య ప్రతిపాదితం తత ఏ వావసేయమ్." వ్యక్తివివేకవ్యాఖ్య. 44 పు.

14. చూ. అధోజ్ఞాపిక. 10.

15. చూ. అధోజ్ఞాపిక. 10.

16, „ 10.

17. „ ఏషా (ఉత్ప్రేక్షా) సమస్తోపమాప్రతిపాదకవిషయేఽపి హర్షచరితవార్త్తికే సాహిత్యమీమాంసాయాం చ తేషు తేషు ప్రదేశే ష్వూదాహృతా (దృశ్యతే)".[61. పు.]

మఱియు వ్యక్తివివేకమునందలి సిద్ధాంతములను ఖండించు నలంకారసర్వస్వపంక్తులపై వ్యాఖ్య వ్రాయునపుడు జయరథుఁ డొకానొకచో 'వ్యక్తివివేకవిచారము'ను రుయ్యకనిర్మితముగాఁ బేర్కొనినట్లు చూచియే యున్నాము. రచనాకౌశలమునుబట్టియు, శయ్యాప్రౌఢిని బట్టియు వ్యక్తివివేకవ్యాఖ్య 'యలంకారసర్వస్వముం దలపించుచు, నీవ్యాఖ్యయే జయరథునిచే సూచింపఁబడిన 'వ్యక్తివివేకవిచారమే' అనునభిప్రాయమును దృఢీకరించుచున్నది. ఈమైక్యాభిప్రాయము సమంజసముగాఁ జూపట్టనిచో రుయ్యకునికంటెను బూర్వుఁడగు నేను ప్రసిద్ధాలంకారికుఁడో యీవ్యాఖ్యను రచియించినట్లు లెంచఁదగు నని 'వ్యక్తివివేక' సంపాదకులగు గణపతిశాస్త్రిగారు పీఠికలో వ్రాసియున్నారు. కాని యీవిషయము సందేహాస్పద మెంతమాత్రముఁ గా దనియుఁ, బైవ్యాఖ్యయు 'వ్య. వి. వి.' ను భిన్నములుగా వనియు, నిది రుయ్యకనిర్మితమే యని కంఠోక్తిగాఁ జెప్పఁదగు ననియు మనవిచేయుచున్నాను.

మహిమభట్టుఁ డనుమానపక్షవాది, వ్యాఖ్యాత యన్ననో యత్యంతపరాకాష్ఠ గల ధ్వనిమతానుయాయి. ఉభయులమతములును బరస్పరవిలక్షణములగుటం జేసి,మహిమభట్టు నభిప్రాయములఁ దఱచు వ్యాఖ్యాత ఖండించుచుండును. ఆనందవర్ధనుని యభిప్రాయములను మహిమభట్టు తీవ్రముగా ఖండించియుండఁగా, నానందవర్ధనుని యనుయాయి యగు(రుయ్యకుఁడు) ప్రకృతవ్యాఖ్యాత మహిమభట్టుని సిద్ధాంతముల నంతకంటెఁ దీవ్రముగాఁ బూర్వపక్షము చేసియున్నాఁడు.

'శ్లో. ఇహ సంప్రతిపత్తితోఽన్యథావా ధ్వనికారస్య వచోవివేచనం నః[18]
నియతం యశసే ప్రపత్స్యతే య న్మహతాం సంస్తవపవ గౌరవాయ॥'

—పీఠికాశ్లోకములు, 3 శ్లో.

అను మహిమభట్టుని శ్లోకమునకు వ్యాఖ్య వ్రాయుచు వ్యాఖ్యాత దూషణగర్భముగా నిట్టులు నుడివి యున్నాఁడు.—"యథాస్థితపాఠేతు ధ్వనికారస్యేతి వచః శబ్దాన్విత మిష్యమాణం ప్రాధాన్యా ద్వివేచనశబ్దాన్వితం ప్రతీయతే. ఏతచ్చాస్య సాహిత్యవిచారదుర్నిరూపకస్య ప్రముఖఏవ స్ఖలిత మితి మహాన్ ప్రమాదః."[19]

18. "అత్ర 'ధ్వనికృద్వాక్యవివేచనం తదేతత్' ఇతి పఠనీయమ్."—వ్య. వి. వ్యాఖ్య, 1 పు.
19. వ్యక్తివివేకవ్యాఖ్య, 1 పు.

మహిమభట్టుని యాత్మోత్కర్షను వ్యాఖ్యాత యనేకపర్యాయము లధిక్షే పించియున్నాఁడు.[20] ఇట్టు లనుటచే మహిమభట్టుగుణమును వ్యాఖ్యాత గుర్తింప లేదనుటకు వీలులేదు. మహిమభట్టుని 'మహామతి' యని వ్యాఖ్యాత స్తుతించియే యున్నాఁడు.[21] ఉదార మగుభావసంపదచే నేమి, సునిశితము స్వతంత్రము నగు హేతువాదముచే నేమి, సంక్షిప్త మగు భావావిష్కరణముచే నేమి, యీవ్యాఖ్య సర్వథా మూలగ్రంథగౌరవమున కనురూపముగా నున్నది. వ్యాఖ్యాత ధ్వని సిద్ధాంతానుయాయి యగుటచే నాసిద్ధాంతమునకు మహిమభట్టుచే నారోపింపఁ బడిన దోషములను విశేషసామర్థ్యముతోఁ, బ్రబలహేతుపురస్సరముగా నిరసించియున్నాఁడు.

మహిమభట్టు 'సంగ్రహశ్లోకములు' [సంగ్రహార్యము లని కాని] అను నామముతోఁ గొన్నిశ్లోకముల నెడనెడఁ దనకృతియందు వ్రాసియున్నాఁడు.[22] పూర్వము చర్చింపఁబడిన విషయసార మీశ్లోకములలో సంగ్రహముగా నొసంగఁబడును. ఇట్టులే వ్యాఖ్యాతయు స్వనిర్మితము లగు'సంగ్రహశ్లోకముల' నటనట నొసంగియున్నాఁడు. పూర్వవ్యాఖ్యాతల నీతఁడు 'కేచిత్తని [32 పు.] సూచించి యున్నాఁడు.

'శ్లో. హేమ్నాం(మ్నో)భారశతాని వా మదముచాం బృన్దాని వా దన్తినాం
శ్రీహర్షేణ యదర్పితాని గుణినే బాణాయ కుత్రాద్యతత్
యాబాణేన తు తస్యసూక్తివిసరై రుట్టఙ్కితాః కీర్తయ
స్తత్ కల్పప్రలయేఽపి యాన్తి న మనాజ్ మన్యే పరిమ్లానతామ్.'

---

20. "తదేత దస్య విశ్వసనీయం మన్యమానస్య హ్యాత్మనః సర్వోత్కర్షశాలితాఖ్యాపన మితి." [41 పు.]

"అ(త్రి)చోపమారూపాభిమతే ఏతం విధే చ ప్రదేశే గ్రంథకారో హేవాకితధైన దూషణమదాత్." [44 పు.]

"నతు హేవాకస్య పర్యాల్లగనీయ మిత్యాస్తాం తావత్" [44 పు.]

21. "యదేత దిహ గ్రంథకృతా విచారసరణి మాశ్రిత్య విధేయావిమర్శాదిదోషప్రపంచ ముద్భావితం, న తత్రాద్యతనపురుషమాత్రబుద్ధిప్రణయ నానూయయా సాదరః కరణీయః. పూర్వైర్నేకవిధదోషోద్భావనరూపస్య విచారస్య ప్రతీతత్వాత్." [వ్య. వి. వ్యా. 15 పు.]

"తదేతం మహావిదుషాం మార్గమనుసృత్య సహృదయశ్రద్ధాదరాయ విచారయ(న్దరం ?) తోఽస్య మహామతే ర్నకశ్చిత్ పర్యనుయోగలేశస్యావకాశ ఇత్యల మతిప్రసక్తేన" [16 పు.]

22. చూ. 6; 14; 18; 22-28; 36; 32; 34-35; 56 పుటలు.

అను భట్టబాణహర్షవర్ధనవిషయక మగు శ్లోక మిం దుదాహరింపఁబడియున్నది.[23] మఱి యు 'హయగ్రీవవధ' యను సంస్కృతకావ్యమును నిర్మించిన భర్తృమేణునిగూర్చిన యీ క్రిందిశ్లోకము గూడ నీపుటలోనే యుల్లేఖింపఁబడి యున్నది.

శ్లో. "పుండ్రేక్షోః పరిపాకపాండునిబిడే యో మధ్యమే పర్వణి
ఖ్యాతః కిఞ్చ రసః కషాయమధురో యో రాజజంబూఫలే
తస్యాస్వాదదశావిలుంటనపటు ర్యేషాం వచోవిభ్రమః
సర్వత్రైవ జయన్తి చిత్రమతయ స్తే భర్తృమేణ్ఠా(ణ్ఠో?)దయః."

వ్యాఖ్యాతలచేఁ బేర్కొనఁబడిన గ్రంథ గ్రంథకర్తలనామములలోఁ బ్రధానములు:—

గ్రంథకర్తలు :	గ్రంథములు :
1. అక్షపాదుఁడు (40 పు)	1. కావ్యకౌతుకము (13 పు)
2. ఉద్భటుఁడు	2. దర్పణము [హృదయదర్పణము, ధ్వనిధ్వంసగ్రంథము 1; 13 పు]
3. కాత్యాయనుఁడు (15 పు)	
4. దండి ['దాణ్డో గ్రన్థః' 47 పు]	
5. ధర్మకీర్తి [కృతవార్తికము. 34 పు]	3. నాటకమీమాంస[32పు]
6. ధ్వనికారుఁడు. (15, 44 పు)	4. బృహతి (45 పు)
7. పతంజలి. (26 పు)	5. వక్రోక్తిజీవితము(16;44పు)
8. పరిమళుఁడు. (52 పు)	6. సాహిత్యమీమాంస(32పు)
9. వామనుఁడు. (29, 45; 52 పు)	7. హర్షచరితవార్తికము(44;50)
10. సౌగతులు. (41 పు)	8. హృదయదర్పణము(1;13పు)

వ్యాఖ్యాత మూలమునందలి పాఠభేదములను[24] బ్రక్షిప్తములనుగూడఁ జర్చించి యున్నాఁడు.[25] అలంకారసర్వస్వమునందలి 'వృత్తి'కారుఁడు (రుయ్యకుఁడు) నీవ్యాఖ్యాతయు భిన్నులు కారు కావున నీవ్యాఖ్య క్రీ. శ. 1150 ప్రాంతముల రచింపఁబడె నని యెంచఁదగును.

IX. శ్రీకంఠస్తవము—ఇది యుత్పన్నప్రాయ మనఁదగును.

'అలంకారసర్వస్వము'న నీగ్రంథము స్వనిర్మితము గా రుయ్యకుఁ డుదాహరించుకొనియున్నాఁడు.

---

23. చూ. 20 పుట.

24. చూ. 33; 35 పు.

25. చూ. 51 పు.

"ఉదాహరణం మదీయే శ్రీకణ్ఠస్తవే యథా:—

*　　　*　　　*　　　*

'శ్లో. అహీనభుజగాధీశవపుర్వలయకఙ్కణమ్
శైలాదినన్దిచరితం క్షతకందర్పదర్పకమ్
వృషపుఙ్గవలక్ష్మాణం శిఖిపావకలోచనమ్
ససర్వమఙ్గలం నౌమి పార్వతీసఖమీశ్వరమ్।
దారుణః కామ్యతో జాతో భస్మభూతికరః పరః
రక్తశోణార్చి రుచ్చణ్డః పాతువః పావకః శిఖీ"

ఏతచ్చ సుబన్తాపేక్షయా. తిఙన్తాపేక్షయాచ యథా తత్రైవ—

భుజఙ్గకుణ్డలీవ్యక్త శశిశుభ్రాంశుశీతగుః
జగన్త్యపి సదాపాయా దవ్యా చ్చేతోహరః శివః" [అలం. స. 19 పు.]

X. సహృదయలీల[26]:—

(1) గుణోల్లేఖము, (2) అలంకారోల్లేఖము, (3) జీవితోల్లేఖము, (4) పరికరోల్లేఖము, అను నాలు గుల్లేఖములు గల చిన్న గ్రంథము. ప్రథమోల్లేఖమున నాకర్షణీయము లగు రమణీమణుల రూపవర్ణప్రభాదు లగు దశగుణములు వర్ణింపఁబడినయవి. ద్వితీయమున ముక్తాసువర్ణరత్నాత్మకము లగు వివిధాలంకారములు, సభ్యంజనయోగ్యము లగు ననులేపాదులు, నారీమణులు ధరించు పుష్పములు మొద లగునవి వర్ణింపఁబడినవి. తృతీయమున రామణీయకమునకు సారభూతమగు యౌవనముంగూర్చి వివరింపఁబడెను. చతుర్థమున సౌందర్యాతిశాయు లగు సామగ్రులను గూర్చి విచారింపఁబడెను.

XI. సాహిత్యమీమాంస:—ఈకృతిరత్న ముత్సన్నమైన దనియే చెప్పఁదగును. ఇది 'అలంకారసర్వస్వము'నందును, 'వ్యక్తివివేకవిచారము'నందు నుదా

---

26 'కావ్యమాల' V గుచ్ఛకము, బొంబాయి, (నిర్ణయసాగరముద్రణము) 'పిషెల్' [Prof. Richard Pischel] పండితుఁడు కూడ దీనిని బ్రచురించియున్నాఁడు. 1886.

శ్రీమాన్ మాడభూషి కృష్ణమాచార్యులవారు తమ 'సంస్కృతవాఙ్మయ చరిత్రము'లో "ప్రాకృతము మనకు లభించిన రుయ్యకుని ద్వితీయగ్రంథము 'సహృదయలీల' యను రసగర్భగీతము (Lyric)" అని వ్రాసియున్నారు. ["A History of the Classical Sanskrit Literature' by Prof. M. Krishnamacharya, M. A. B. L., 1906, Page

హరింపఁబడియున్నది.[27] విద్యానాథుఁడు [1325 క్రీ. శ.] కూడ దీని నుదాహ రించియున్నాఁడు.

"ప్రబంధరాజే శ్రీహర్షపురుషగుణవర్ణనం హేమ్నః శర మహిమోదః ... . ప్రపంచితం చ సాహిత్యమీమాంసాయామ్ 'నాయకగుణ గ్రథితా సూక్తిస్రజ స్సుకృతినా మాకల్పంతి' ఇతి.[28]" ఈ గ్రంథరాజముంగూర్చి యింతకంటెఁ బ్రకృత మేమియుఁ దెలియుటలేదు.

XII. హర్షచరితవార్తికము—ఈ గ్రంథముకూడ నుత్పన్నకల్ప మనియే నుడువఁదగును. అలంకారసర్వస్వమునందును వ్యక్తివివేకవ్యాఖ్యయందు నీగ్రం థము పేర్కొనఁబడియున్నది. ప్రకృతము మనకు లభియించిన హర్షచరితవ్యాఖ్యల లో శంకరపండితుని 'సంకేతవ్యాఖ్య' ప్రాచీనతమముగాఁ జూపట్టెడిని. ఇతఁడు బహుశః కాశ్మీరదేశీయుఁడే కావచ్చును. అయినను దనవ్యాఖ్యలోఁ గాశ్మీరపం డితులగు భామహోద్భటుల నీతఁడు పేర్కొనియెఁ, గాని, మమ్మట రుయ్యకుల నుదాహరించి యుండలేదు. అందువలన నీతఁడు రుయ్యకునికంటెఁ బూర్వుఁడని యే నిర్ణయింపనగును. శంకరుని వ్యాఖ్యకంటెఁ బూర్వము మఱికొన్ని వ్యాఖ్య లున్నట్లు, "కేచిత్, అన్యే, అపరే" అను నీతని సూచనలవలనఁ దెలియుచున్నది.

మఱియు నాధునికుఁడగు యస్.డి. గజేంద్రగడ్కర్ పండితుఁడు కూడ హర్ష చరితమునకు 'బాలబోధిని' యనునొక వ్యాఖ్య రచించియున్నాఁడు.

ఇతోఽధికముగ నీగ్రంథమును గూర్చి తెలియుటలేదు.

కావ్యమునకు శబ్దములు శరీరమువంటివని దండి నుడివియున్నాఁడు. అట్లగుచోఁ గావ్యమున కాత్మ యేది యని ప్రశ్న కలుగుచున్నది. దీని కాయాయా లంకారికులు వారివారిమతముల ననుసరించి వివిధము లగుసమాధానముల నొ సఁగియున్నారు. ఆమతములలోఁ బ్రధానములు కాలక్రమమునుబట్టి యేవన:—

1 రసమతము, 2 అలంకారమతము, 3 రీతిమతము, 4 ధ్వనిమతము, 5 వక్రోక్తిమతము. మఱియు ననుమానమతము, ఔచిత్యమతము, చమత్కార మతము మొద లగున వనేకములు గలవు. అలంకారవిషయమున రుయ్యకుఁ

165.] కాని యది ప్రామాణికము. ఈప్రతి 'సహృదయలీల' కాని 'సహృదయరీతి' కాదు ఇది యలంకారగ్రంథమే కాని రసగర్భగీతము కాదు.

27 చూ. అధోజ్ఞాపికలు 10; 18.

28. ఉపోద్ఘాతపరికరణము, 9 పు. (వావిళ్ళవారిప్రతి)

డుద్భట కుంతకులమతము ననుసరించినను, నీతఁడు ధ్వనిపక్షవాదియే కాని యలంకారమతానుయాయి కాఁడు. సునిపుణధిషణుఁ డగునీతఁడు చిరంతనాలంకారికుల యభిప్రాయములను నవీనులయభిప్రాయములను విశేషసామర్థ్యముతో సమన్వయ మొనరించియున్నాఁడు. ప్రాచీనాలంకారికుల గ్రంథములకు రుయ్యకునియలంకారసర్వస్వము పరిశిష్టగ్రంథమువంటిది. ధ్వనికారుఁడు కావ్యమును—ధ్వని, గుణీభూతవ్యంగ్యము, చిత్రము-అని మూఁడువిధములుగా విభజించియున్నాఁడు. అందు మొదటిరెండువిధములును ధ్వన్యాలోకమున వివరింపఁబడియున్నవి. శబ్దార్థాలంకారప్రధాన మగుచిత్రకావ్యమున కంతఁ బ్రసక్తి లేకపోవుటచే నీభాగమును రుయ్యకుఁడు సర్వంకషముగాఁ జర్చించియున్నాఁడు. నవీనాలంకారికులలోఁ బ్రధానులగు విశ్వనాథుఁడు, విద్యాధరుఁడు, విద్యానాథుఁడు, అప్పయదీక్షితులు నీతని యభిప్రాయములను బరమోపాదేయము లని యెంచియున్నారు. ఒక్క రసగంగాధరకారుఁడు దక్క రుయ్యకునిమతమును ఖండించినవారే లేరు. దీనినిబట్టి చూఁడఁగా రుయ్యకుఁ డలంకారసారస్వతసామ్రాజ్యమున నెంతయుత్కృష్టస్థానము నలంకరించియున్నాఁడో తెలియఁగలదు.

గ్రంథస్వీకారము.

1. శ్రీశతకరత్నాకరము:—ఇందు భాస్కరోపాసకులు శ్రీయుత, అకుల భూపతికవిగారిచే రచియింపఁబడిన నవరత్నద్వాదశప్రాసభాస్కరశతకమును, మానసబోధశతకమును, శౌరిశతకమును—భూపతికవిగారి కుమారుఁడు శ్రీయుత పెద్దయ్యకవిగారిచే రచియింపఁబడిన రాఘవశతకమునుం గలవు. భాస్కరశతక రాఘవశతకములు వృత్తములు. మానసబోధ, శౌరిశతకములు కందములు. భూపతికవిగారు దివంగతులైరి. వీరికవిత్వము భక్తిరసప్రధానమై నిర్దుష్టమై ధారాళముగ నున్నది. దీని వెల రు 0-4-0. అకుల పెద్దయ్యగారి యొద్ద అమలాపురము తా॥ కూనవరములో దొరకును.

నవరత్నద్వాదశప్రాసభాస్కరశతక మొక్కొక్క ప్రాసమునకు తొమ్మిదేసిపద్యములచొప్పునఁ బన్నెండక్షరముల ప్రాసములతోడివృత్తములు. మచ్చు-

మ. పగలే పూనెద వెల్లకాలమును నాభాగ్యం బదెంతందు భూ
తగణంబుల్ నినుఁజూచిన న్భయముచేతం బాఱు వేయేల నీ
రగ మాఱుం గద రోగపుంజములు నీహూపంబు లగ్గింపఁ బ
న్నగరాజేంద్రనికేతనంగాదు వినుదీనాధార యోభాస్కరా. గకారప్రాసము.46

ఉ. దండిగ నేఁగుచుండినరథంబున కొక్కటె చక్రముండెనా
యుండుట కేమివింత సుగుణోత్తమ రజ్జులు పాము లేకదా
నిండుబయల్ నుంగొనఁగ నెచ్చుడిఁబూనుము పర్వతాను నీ
యుండకు రాఁదలంపుగల యాకులభూపతికోర్కె భాస్కరా. -ండప్రాసము. 90

క. మిన్నున నేనున్నాఁడను, మన్నున నీవుండినావు మానక యెపుడున్
నిన్నుఁ గరుణించు టెట్లని, పన్నగ శ్రీభాస్కరుండు పలుకఁడు మనసా. 41

క. కిరణంబులు తాఁకినచో, దురితము లేవైఁ గాని తొలఁగక నిలువం
దరమా యిది గావున భా, స్కరునికిఁ గడుమ్రొక్కు లిడుము చపలపు మనసా.

క. పాపాత్మసభను ద్రౌపది, కేపట్టును లేక యుండ నిభరాడ్వరదా
కాపాడు మనినఁ గాచితి, వాపద్బాంధవుఁడ వనుట కరుదే శౌరీ. 17

చ. ఘనమగు కామమాదిగల గ్రాహకదంబముచే వెలుంగు నీ
తనువనునబ్ధిలోన భయదంబగు వ్యాధితరంగవల్లిలో

మునుఁగుచుఁ దేలుచుండి తటమ్ముం గనలేని మదీయజీవనౌ
కను నొకయొడ్డుచేర్చి మనఁగాఁ గరుణింపవె స్వామి రాఘవా. 46

ఉ. బాహుబలుండ నే నొకని ప్రాపును గోర నటంచు గర్వసం
దోహముఁ బొందరాదు తపనుండు సహస్రకరాన్వితుండు మం
దేహవినాశనార్థ మొకదీనధరామరు నర్ఘ్యతోయసం
దోహ మపేక్షసేయుటఁ బుధుల్ వచియించుట లేదె రాఘవా. 61

ఈపెద్దయ్యగారు రచించిన బిల్హణీయము ను మఱికొన్ని శతకములును వెలువడనున్నవి.

2. హంసతారావళి - లలితాశతకము.

హైదరాబాదు నైజాంకాలేజీ ప్రొఫెసరు, విద్వాన్ బ్ర. సరిపెల్ల విశ్వనాథ శాస్త్రి, యం. ఏ. గారు రచించినవి. వీరు కొల్లాపురము స్నేహలతాసంఘమునం దొకసభ్యులు. ఆసభవారి ప్రోత్సాహమునఁ బ్రసంగవశమున హంసతారావళి- "మానసరాజహంస చనుమా వినువాకకుఁ బ్రొద్దుగ్రుంకెడిన్" అను మకుటముతోను, నకార ప్రాసయుతముగను—లలితాశతకము, "లలితా రశ్మిఁకఁ గాలయాపనము లేలా? రాజబింబాననా?" యనుమకుటముతో లకార ప్రాసముతోడి మత్తేభములుగను రచియించిరి. వీరు సంస్కృతాంగ్లములలో యం. ఏ. పరీక్ష నిచ్చిరి. ఆంధ్రమున విద్వత్పరీక్ష నిచ్చిరి. కావున మూఁడుభాషలలో ససమాన మైనపాండిత్యము గలవారు. బుద్ధిమంతులు, నిగర్వులు నగువీరిభాషాభిమానము తదనుగుణముగనె యుండు ననుటకు సంశయములేదు. కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారును శతావధానులు చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారును వీరి కవితను మెచ్చుకొనిరి. మచ్చునకు రెండుపద్యములు.

1. మానవు నీకుబుద్ధి విను మానసము లబ్దము లెన్నియేఁ జనెన్
మేనులు పెంచువాంఛలను మేఁపఁగఁ జూచితి వంతెకాని నీ
దీనత తీఱిపోయినదె? తెల్పుము నన్నిటుఁ ద్రిప్పనెంచితో
మానసరాజహంస చనుమా వినువాకకుఁ బ్రొద్దుగ్రుంకెడిన్.

1. అలరుందావులు వ్యాప్తమైనగతి విద్యాగంధవాహంబు భా
సిలుచందంబున నక్షరంబగు యశశ్శ్రీసౌమ్యకర్పూరకాం
తిలతాజ్యోతులు వెల్గుచాడ్పునఁ గదే ధ్యేయంబు నీచాయలో
లలితా! రశ్మిఁకఁ గాలయాపనము లేలా రాజబింబాననా!

పద్యములంబట్టి వీరియుపాసనావిధము తెల్లము గాఁగలదు. దీనికి ముందు స్నేహలతాకవితాసంఘమున కధ్యక్షులు సోదరకవులు, వి. రామసుబ్బారాయఁడుగారును, వేంకటనారాయణగారును వ్రాసిన పీఠిక కలదు. వెల రు 0-4-0. కర్నూలుజిల్లా మొరవకొండపోస్టు కొల్లాపురములో స్నేహలతాకవితాసంఘములో నీపొత్తమే గాక యనేకగ్రంథములు దొరకును.

3. పళ్లమాంబికాతారావళి.

శ్రీయుత వడ్లమాని సూర్యనారాయణశాస్త్రిగారి ప్రోత్సాహముచే వాజపేయయాజుల రామసుబ్బారాయఁడుగారు రచించినతారావళి. గోదావరీమండలములో వానపల్లి పళ్లాలమ్మ మిగులఁ బ్రసిద్ధికెక్కినది. పలువురు, తమబిడ్డలకు పల్లయ్య, పల్లమ్మ, పల్లమరాజు, పళ్లాలు- అని యాదేవతపేళ్లను బెట్టుకొనుచున్నారు. వైశాఖమాసములో సంవత్సరోత్సవము విరివిగా జరగుచుండును. ఇందు మొదట నాయంబవృత్తాంతము చేర్పఁబడినది. ఇది యమూల్యము. కొల్లాపురములోనే దొరకును.

ఏదో చిక్కు దయించువేళలనొ లే కేదో భయభ్రాంతినో
యేదో దైన్యము గల్గువేళలనొ నీవే దిక్కు గాఁ గొల్తు రే
తాదృగ్దైవత మెందు లే దనుచు నాధర్మంబునం గాక నీ
పాదాబ్జంబు లనుక్షణంబు నెదలో భావింతుఁ బళ్లాంబరో.

4. నాగానందనాటకము.

శ్రీహర్షదేవుని సంస్కృతమునకు,పాలెపు వేంకటసూర్యగోపాలప్రధానుల యాంధ్రానువాదము.రెండవకూర్పు. దీనిని 1890 సం॥లోఁ గాకినాడలోఁ గవిగారు న్యాయవాదులుగానున్నపుడు మొదటిసారియచ్చువేయించిరి. దానికంటె దీనిలో మార్పులేమియుం జేయలేదు. ఈనాటకము తెనుఁగుదేశములో విరివిగా వ్యాపించినట్లు లేదు. ఇందు నాయకుఁ డగుజీమూతవాహనుఁ డొకనాగుని రక్షించుటకై తనశరీరమును గరుత్మంతున కర్పించుట వర్ణితము. దానిచేతనే యతనిని శిబి, దధీచి, కర్ణాదులగు మహాదాతలలో నుగ్గడించుచున్నారు. 4, 5, అంకములు చదువునప్పుడు కరుణ ముట్టిపడుచుండును. గరుడునకు-దినమున కొక్క నాగుని దినునట్లు వాసుకి సమయముచేయించినాఁ డనినమాట విని జీమూతవాహనుఁ డనినక్రింది యొక్క పద్యమేచాలును జీవకారుణ్యమునకు——

శ్లో. జిహ్వాసహస్రద్వితయస్యమధ్యే, నైకాపి సా తస్య కిమస్తి జిహ్వా
ఏకాహిరక్షార్థమహిద్విషోద్య, దత్తామయాత్తేతి యయాబ్రవీతి.

గీ. ఆఫణీంద్రు జిహ్వాద్విసహస్రమందు, నొంది యొకపామునైన రక్షించుకొనఁడు
నిదిగో నాదేహమును గొను మిత్తునన(గ,జాలనిది యయ్యెనే యొకనాలుకైన.

నాటకము తెనిఁగింపును మృదువుగా నున్నది. శ్రీ వేంకటసూర్యగోపాలముగారు వెనుక, జానకీపరిణయమును, కమలినీకలహంసమును గూడ నాంధ్రీకరించి ప్రకటించిరి.

క్రోడీకరోతి ప్రథమం జాతం నిత్యమనిత్యతా
ధాత్రీవ జననీ పశ్చాత్ తదా శోకస్య కః క్రమః.

క. తొమ్మున నిడుకొను దాది వి,ధమ్మున మును మున్ననిత్యతయె, జంతువులం
బిమ్మట నే మాతగదా, యమ్మా యిట శోకహేతు వరయఁగ నేదీ.

ఈనడుమ ముద్రారాక్షసమును దెనుఁగుచేసి ప్రకటించి యుండిరి. దీనివెల ౮ అణాలు. అమలాపురములోఁ గవిగారియొద్ద దొరకును.

5. వైజయంతి.

భావ సం॥ చైత్రమాసములో కొల్లాపురము స్నేహలతాకవితాసంఘము నుండి వెలువడిన ద్వితీయవార్షికపత్రిక. శ్రీ చేబ్రోలు సరస్వతీదేవిగారు సంపాదకురాలు. క్రౌను నాల్గుపుటలతోడి 60 పుటల సంచిక. ఇందుఁ బలువురు భాషాభూషణుల గద్యపద్యవ్యాసములను జేర్చిరి. జనమంచి వేంకటరామయ్యగారి మేఘసందేశము, నిడమర్తి సత్యనారాయణగారి తిక్కనస్వతంత్రరచన, అనుముల సుబ్రహ్మణ్యశాస్త్రిగారి గర్వితకన్య, భాగవతం సీతారామశాస్త్రిగారి దేవకీనందన తారావళి, మిన్నగ నున్నవి. ముమ్ముందీసంవత్సరాదిసంచికయు హృష్టపుష్టమై వెలువడఁగలదని యూహించుచున్నాము. దీని వెల రు ౧. భాషాధిపులు దీనిలో నమూల్యవ్యాసముల రచించియుఁ బాఠకులు దీనిం గొనియు స్నేహలతాకవితాసంఘమువారికిఁ దోడ్పడుదురుగాక !

సేతుబంధమహాకావ్యభూమిక.

—: శ్రీమాన్ మేడేపల్లి వేంకటరమణాచార్యులుగారు :—

శ్లో. "అత్ర సహూప్యత ఏత త్సీతాలంభేన జనితరామాభ్యుదయమ్
రావణవధ ఇతి కావ్య మనురాగాంకం సమస్తజననిర్వేషమ్"

(15 ఆశ్వా-15 స్కంధకము) సీతాప్రాప్తిచే లబ్ధరామాభ్యుదయ మైన యీకావ్యమునకు రావణవధ మని పేరు. ఇందులోఁ బ్రత్యాశ్వాసాంతస్కంధకము ననురాగపదాంకిత మైయున్నది.

శ్లో. "మహారాష్ట్రాశ్రయాం భాషాం ప్రకృష్టం ప్రాకృతం విదుః
సాగర స్సూక్తిరత్నానాం సేతుబంధాదియ న్మయమ్."

అని యాచార్యదండి తనకావ్యాదర్శమం దీకావ్యమునకు సేతుబంధ మని మఱియొక పేరు పెట్టెను. అష్టవిధప్రాకృతభాషలలో మహారాష్ట్రభాష యుత్తమ మైన దనియు నాభాషలో నీసేతుబంధమహాకావ్యము వ్రాయఁబడిన దనియుఁ జెప్పుచున్నాఁడు.

శ్లో. "అభినవరాజారబ్ధా చ్యుతస్ఖలితేషు విఘటితపరిస్థాపితా
మైత్రీవ ప్రముఖరసికా నిర్వోఢుం భవతి దుష్కరం కావ్యకథా"

అని ప్రథమాశ్వాసనవమస్కంధకముచేతను, బ్రత్యాశ్వాసాంతమందు "ఇతి శ్రీప్రవరసేనవిరచితే" అని యుండుటచేతను,

శ్లో. "కీర్తిః ప్రవరసేనస్య ప్రయాతా కుముదోజ్జ్వలా
సాగరస్య పరం పారం కపిసేనేవ సేతునా"

అని హర్షచరిత్రోపోద్ఘాతమందు భట్టబాణుఁడు వ్రాసి యుండుటచేతను "యథా సేతుబంధే ప్రవరసేనస్య-

శ్లో. దనుజేంద్రరుధిరలగ్నే యస్య స్ఫురతి నఖప్రభాసమూహే
వ్యాకులీభవంతి విపలాయితా గళితస్తనాంశుకా మహాసురలక్ష్మీః."

అని పదునొకండవశతాబ్దమందు జీవించిన కాశ్మీరదేశస్థుఁ డగుమహాకవి క్షేమేంద్రుఁడు తాను రచియించిన "ఔచిత్యవిచారచర్చ"లోఁ జెప్పియుండుటచేతను ప్రవరసేనుఁ డనునొకమహారా జుండె నని తోఁచుచున్నది. ప్రవరసేనుఁ డను పేరు గలరాజులు నలుగు రున్నారు. వారిలో నిరువురు కాశ్మీరదేశస్థులు. రాజతరంగిణీతృతీయతరంగమందు కల్హణునిచే వర్ణింపఁబడిరి.

శ్లో. "శతేషు షట్సు సార్ధేషు త్ర్యధికేషు చ భూతలే
కలేర్గతేషు వర్షాణా మభవ న్కురుపాండవాః" (రాజ-1-51)

కలియుగము 653 సంవత్సరములు కాఁగా, కురుపాండవు లుండిరి.

శ్లో. "వర్షాణాం ద్వాదశశతీ షష్టిః షడ్భిశ్చ సంయుతా
భూభుజాం కాలసంఖ్యాయాం తద్వా పంచశతో మతా" (రాజ-1-54)

అను వాక్యమును బట్టి 1266 సంవత్సరములలో నేఁబదియిద్దఱు రాజులు గతించిరి.

శ్లో. "చతుర్దశాధికం వర్షసహస్రం నవవాసరాః
మాసాశ్చ విగతా హ్యస్మి న్నేకవింశతిరాజసు"

అనురాజతరంగిణీ (1-84) శ్లోకమందు వర్ణింపఁబడిన ప్రకారము లవమహారాజు రాజ్యప్రారంభకాలము 1014.

శ్లో. "శతద్వయే వత్సరాణా మష్టభిః పరివర్జితే
అస్మిన్ ద్వితీయే వ్యాఖ్యాతాః షట్ప్రఖ్యాతగుణా నృపాః"

అని ద్వితీయతరంగమందు

శ్లో. "తస్మి న్నస్తంగతే భుక్త్వా క్ష్మాం చ తు స్త్రింశతం సమాః
అనాదిత్య మి వాశేషం నిరాలోక మభూ జ్జగత్"

అని మేఘవాహనమహారాజు పరిపాలనకాలము ముప్పదినాలుగుసంవత్సరములు గతింపఁగా,

శ్లో. "అథ క్ష్మాభృ ద్దధౌ క్ష్మాం శ్రేష్ఠసేన స్తదాత్మజః
అహుః ప్రవరసేనం యం తుంజీనం చాంజసా జనాః"

శ్లో. "ఈశో నృపాణాం నిశ్శేష క్ష్మాకేదారకుటుంబినామ్
ససమా స్త్రింశతంభూభృ దని స్త్రింశాశయోఽభవత్"

(రాజ 3-101) అను శ్లోకమును బట్టి ప్రథమప్రవరసేనుని రాజ్యకాలము ముప్పదిసంవత్సరములు కలిపికొనఁగా 3159—89 కల్యబ్దములు కాఁగాఁ బ్రథమప్రవరసేనుఁడు కాశ్మీరమండలమందు రాజ్య మేలెను.

శ్లో. "పౌత్రః ప్రవరసేనస్య గిరా మాతు ర్న్యపాత్మజః
పైతామహేన నామ్నైవ కులాల్యాఖ్యాపితోభవత్" (రాజ-3-109)

శ్లో. "నివార్య మరణోద్యోగం మాతుర్ని ర్వేదఖేదితః
యయౌ ప్రవరసేనోఽథ తీర్థాత్సుక్యా ద్దిగంతరమ్" (రాజ 1-123)

శ్లో. "రక్షిత్వా దశమాసోనాః త్వా మేకత్రింశతం సమాః
తస్మిన్ క్షణే హిరణ్యోపి శాంతిం నిస్సంతతి ర్యయా" (3-124)
శ్లో. "తత్రానేహ స్యుజ్జయిన్యాం శ్రీమాన్ హర్షాపరాభిధః
ఏకచ్ఛత్ర శ్చక్రవర్తీ విక్రమాదిత్యఇత్యభూత్" (3-125)

ప్రవరసేనుని మనుమఁడు తల్లియాజ్ఞ ననుసరించి తాతపేరునే పెట్టుకొనెను. తల్లి మరణోద్యోగమును నివారించి నిర్విణ్ణుఁడై తీర్థయాత్రలకుఁ జనెను. పదిమాసములు తక్కువ ముప్పదిసంవత్సరములు రాజ్యము చేసి నిర్వేదమును జెంది తీర్థయాత్రలకుఁ బోయెను. ఆకాలమందు హిరణ్యుఁ డనువాఁడు సంతతి లేకుండఁ గాలధర్మము నొందెను. ఆకాలమం దుజ్జయినీనగరమున హర్షుఁ డను నామాంతరము గల విక్రమాదిత్యుఁ డేకచ్ఛత్రాధిపతి యై రాజ్య మేలెను. ఇట్లు పూర్వోక్త శ్లోకప్రామాణ్యముచేఁ బ్రవరసేనుని జ్యేష్ఠపుత్త్రుఁ డగు హిరణ్యుని రాజ్యపరిపాలన కాలము 31 సంవత్సరములు కలుపఁగాఁ దేలిన 3220 కల్యబ్దములకు ముందే ప్రవరసేనుని కనిష్ఠపుత్త్రుఁ డగు తోరమాణుని కుమారుఁ డైన ప్రవరసేనుని జన్మము. ఇట్లు క్రీస్తుశకము ద్వితీయశతకమందు కాశ్మీరికద్వితీయప్రవరసేనునికాలము నిశ్చయింపఁ బడుచున్నది.

Dr G Buhler Ph. D. మహాశయుఁడు వాకాటకవంశమందుఁ గూడ నిద్దఱు ప్రవరసేను లున్నా రని "ఇలిచపూరుశాసనము" వలనఁ గనఁబఱిచెను.

"ఓం ఓం స్వస్తి ప్రవరపురా దగ్నిష్టోమాప్తోర్యామోక్థ్యషోడ శ్యతిరాత్ర వాజపేయసవసాద్యస్క చతురాశ్వమేధయాజినః విష్ణువృద్ధసగోత్రస్య సామ్రాజో వాకాటకానాం మహారాజశ్రీ ప్రవరసేనస్య సూనోః అత్యంత స్వామిమోహా భైరవభక్తస్య అన్సభారసన్నివేశిత శివలింగోద్వహన శివసు పరితుష్టసముత్పాదిత రాజవశానాం పరాక్రమాధిగతభాగీరథ్యమలజలమూర్ధ్నాభిషిక్తా నాదశాశ్వమేధావభృథస్నాతానాం భారశివానాం మహారాజభవనాగదౌహిత్రస్య గోమతీపుత్రస్య వాకాటకానాం మహారాజశ్రీ రుద్రసేనస్య సూనో రత్యంతమాహేశ్వరస్య సత్యార్జవకారుణ్యశౌర్యవిక్రమ నయవినయమాహాత్మ్యాధిమత్వపాత్రాగత భక్తిత్వ ధర్మవిజయిత్వ మనోనైర్మల్యాదిగుణై స్సముపేతస్య వర్ష మభివర్ధమాన కోశదండసాధనసంతానపుత్రపౌత్రిణః యుధిష్ఠిరవృత్తే ర్వాకాటకానాం మహారాజశ్రీ పృథివీషేణస్య సూనో ర్భగవత శ్చక్రపాణేః ప్రసాదోపార్జిత శ్రీసముదయస్య వాకాటకానాం మహారాజశ్రీ రుద్రసేనసూనో ర్మహారాజాధిరాజ శ్రీదేవగుప్తసుతాయాం

ప్రభావతీగుప్తాయా ముత్పన్నస్య శంభోః ప్రసాదధృతికార్తయుగస్య వాకాటకా
నాం పరమమాహేశ్వర మహారాజశ్రీ ప్రవరసేనస్యవచనా భోజకటరాజ్యే మధు
నదీతటకే చర్మాంకనామగ్రామః రాజమానిక భూమిసహస్రైరష్టాభిః 8000 శత్రు
ఘ్నరాజపుత్ర కోండరాజవిజ్ఞాప్త్యా నానాగోత్రచరణేభ్యో బ్రాహ్మణేభ్య స్సహస్రాయ
దత్తః యతో స్మత్సంతకాః సర్వాధ్యక్షాధియోగనియుక్తా ఆజ్ఞాసంచరి కులపుత్రా
ధికృతా భటా శ్ఛాత్రాశ్చ విశ్రుతపూర్వ యాజ్ఞ'యాజ్ఞాపయితవ్యా విదిత మస్తు
వో యథేహ స్మాకం మనోధర్మాయుర్బలవిజయైశ్వర్యవివృద్ధయే ఇహాముత్రహితార్థ
మాత్మానుగ్రహాయ వైజకే ధర్మస్థానే అపూర్వదత్త్యా ఉదకపూర్వ మతిసృష్టః।
అథాస్యోచితాంపూర్వరాజానుమతాం చాతుర్వైద్యగ్రామమర్యాదాన్వితరామ
స్త్ద్యథా। అకరదాయీ అభటచ్ఛాత్రప్రావేశ్యః అపారంపరగోబలివర్దః అపుష్ప
క్షీరసందోహః అచారాసనచర్మాంగారః అలవణక్లిన్నక్రేణిఖనకః సర్వవేష్టిపరిహార
పరిహృతః సనిధి స్సోపనిధిః సంక్లుప్తోపక్లుప్తః। ఆచంద్రాదిత్యకాలీయః పుత్రపౌత్రా
నుగమకః। భుజతాం న కేనచి ద్వ్యాఘాతం। కర్తవ్య స్సర్వక్రియాభి స్సంరక్షిత
వ్యః। పరివర్ధయితవ్య శ్చ। యశ్చాయం శాసన మగణయమానో స్వల్పమపిబా
ధాం కుర్యాత్కారయితావా తస్యబ్రాహ్మణై ర్వేదితస్య సదండ నిగ్రహం కుర్యామః।
అస్మింశ్చ ధర్మావరకరణే అతీతానేకరాజదత్త సంచింతన పరిపాలనం కృతపుణ్యాను
కీర్తన పరిహారార్థం న కీర్తయామః వ్యాసగీతా చాత్ర శ్లోకా ప్రమాణీకర్తవ్యాః।
స్వదత్తాం పరదత్తాం వా యో హరేత వసుంధరాం। గవాం శతసహస్రస్య
హంతు హరతి దుష్కృతం। షష్టి వర్షసహస్రాణి స్వర్గే మోదతి భూమిదః।
ఆచ్ఛేత్తాచానుమంతాచ తాన్యేవ నరకే వసేత్। ఇతి శాసనస్థితి శ్చేయం బ్రాహ్మణై
రీశ్వరై శ్చానుపాలనీయా యథా రాజా సప్తాంగే రాజ్యే అద్రోహ ప్రవృత్తానాం
బ్రహ్మఘ్నచోరపారదారికరాజాపథ్యకారి ప్రభృతీనాం సంగ్రామకుర్వతాం అన్యగ్రా
మేష్వనపరాధానాం ఆచంద్రాదిత్యకాలీయః అతోఽన్యథా కుర్వతా మనుమోద
తాం వ్యోరాజ్ఞః భూమిచ్ఛేదం కుర్వతః అస్తేయ మితి ప్రతిగ్రాహిణ శ్చాత్ర వార
నియుక్తాః శాట్యాయనః గణార్యః వాత్స్యదేవార్యః భారద్వాజ కుమారశ
ర్మార్య పారశర్య గుహశర్మా కాశ్యపదేవార్యః మహేశ్వరమాత్రార్య కౌండిన్య
రుద్రార్య సోమార్య హారిశర్మార్య భారద్వాజ కుమారశర్మార్య కౌండిన్య మాతృ
శర్మా వరశర్మా గోండశర్మా నాగశర్మా భారద్వాజ శాంతిశర్మా రుద్రశర్మా వాత్స్యః
భోజక దేవార్య మఘశర్మా దేవశర్మా భారద్వాజమోక్షశర్మా నాగశర్మా రేవతిశర్మా

ధర్మార్యభారద్వాజశర్మార్య నందనార్య మూలశర్మా ఈశ్వరశర్మా వరశర్మా వాత్స్య స్కందశర్మా భారద్వాజ బప్పార్య ధర్మార్య ఆత్రేయస్కంధార్య గౌతమసోమశర్మార్య భర్తృశర్మార్య రుద్రశర్మ మఘార్య మాతృశర్మార్య ఈశ్వరశర్మార్య గౌతమసగోత్ర మాతృశర్మార్య కౌండిన్యదేవశర్మార్య వరశర్మార్య రోహార్య గౌతమసగోత్ర స్వామి దేవార్య రేవతీశర్మార్య జ్యేష్ఠశర్మార్య శాండిల్య కుమారశర్మార్య స్వాతిశర్మార్య చాత్రాయణకోండార్య ప్రభృతయః సేనాపతౌ ఖత్రవర్మణి సంవ్వసరేష్టాదశమే ౧౮ జ్యేష్ఠమాస శుక్లపక్షే త్రయోదశ్యాం శాసనం లిఖిత మితి వాకాటకలలామస్య క్రమప్రాప్తనృపశ్రియః। రాజ్ఞః ప్రవరసేనస్య శాసనం రిపుశాసనం."

ఇండియన్ యాంటిక్వరీ (Indian Antiquary) 12వ-వాల్యూమ్. 243 పేజీలోఁ గనఁబర్చఁబడినది. దీనివలనఁ బ్రథమ ప్రవరసేనమహారాజు క్రీస్తుశకము చతుర్థశతకమందును ద్వితీయ ప్రవరసేనమహారాజు పంచమశతకమందును రాజ్యము చేసి రని నిశ్చయింపఁబడినది. ఇట్లు కల్హణుని రాజతరంగిణీప్రమాణానుసారముగా నిద్దఱు ప్రవరసేనులు, పూర్వోక్త శాసనమువలన నిద్దఱు ప్రవరసేనులుఁ గానవచ్చుచున్నారు. వీరిలో సేతుబంధమహాకావ్యమునురచించిన ప్రవరసేనుఁ డెవ్వఁడో నిశ్చయింపఁబడ లేదు.

భోజుఁడే ప్రవరసేనుఁ డని కొందఱవాదము. "అభినవరాజారబ్ధా చ్యుత స్థలితేషు విఘటితపరిస్థాపితా'' అను ప్రథమాశ్వాసములోని నవమస్కంధకమును వ్యాఖ్యానముచేయుచు సేతువ్యాఖ్యాత యగు రామదాసు "ప్రవరసేనో భోజదేవ ఇతి కేచిత్'' అని వ్రాసెను. కాని యిది సరికాదు. ఏల యనఁగా- హర్షచరిత్ర భూమికలో బాణుఁడు "కీర్తిః ప్రవరసేనస్య ప్రయాతా కుముదోజ్జ్వలా। సాగరస్య పరం పారం కపిసేనే వ సేతునా" అని చెప్పి యుండుటచే భోజుఁడు బాణునికంటెఁ బూర్వుఁడై యుండవలెను. ఇది యనేకగ్రంథవిరోధముగావున భోజుఁడు ప్రవరసేనుఁడు గా నేరఁడు. దీనివ్యాఖ్యానమయిన రామసేతుప్రదీపమందు-

"ధీరాణాం కావ్యచర్చా చతురిమవిధయే విక్రమాదిత్యవాచా
యం చక్రే కాళిదాసః కవికుముదవిధు స్సేతునామ ప్రబంధమ్
తద్వ్యాఖ్యా సౌష్ఠవార్థం పరిషది కురుతే రామదాస స్స ఏవ
గ్రంథం జల్లాలదీంద్రక్షితిపతివచసా రామసేతుప్రదీపమ్"

అని గ్రంథప్రారంభమం దున్నయీశ్లోకముచే మహారాజ ప్రవరసేనునికొఱకు మహారాజాధిరాజ విక్రమాదిత్యునాజ్ఞచే నిఖిలకవిచక్రచూడామణి యగు కాళి

దాసమహాశయుఁడు సేతుబంధ మనుప్రబంధమును రచియింపఁబోవువాఁడై నిర్విఘ్నపరిసమాప్త్యర్థమై రామచంద్రాత్మక మధుమథనరూపేష్టదేవతానమస్కారోపదేశముఖముగా మంగళము నాచరించుచున్నాఁడు.'' అని ప్రథమస్కంధకావతరణికచేఁ బ్రకృతగ్రంథమందుఁ బ్రత్యాశ్వాసాంతమందు "ఇఅసిరి పవరసేనవిరఇఏ కాళిదాసకఏ దహముహవహే మహాకవ్వే'' అని వ్రాయుటచేత నీకావ్యము ప్రవరసేనకారిత మనియుఁ, గాళిదాసకృత మనియుఁ దోఁచుచున్నది. కాశ్మీరికద్వితీయప్రవరసేనవిక్రమాదిత్యు లుభయులు సమకాలికులై యున్నను విక్రమాదిత్యునికాలమందు ద్వితీయప్రవరసేనుఁడు రాజ్యప్రాప్తికంటె ముందే తీర్థయాత్రార్థమై కాశ్మీరదేశమును విడిచి వెళ్లిపోయెను.

"యయౌ ప్రవరసేనోఽథ తీర్థోత్సుక్యా ద్దిగంతరమ్। తత్రానేహ స్యుజ్జయిన్యాం శ్రీమాన్ హర్షోఽపరాభిధః। ఏకచ్ఛత్రశ్చక్రవర్తీ విక్రమాదిత్య ఇత్యభూత్'' (3-125) అని రాజతరంగిణి చెప్పుచున్నది. విక్రమాదిత్యునిస్వర్గారోహణసమనంతరమందే మాతృగుప్తుఁడు కాశ్మీరదేశమును విడిచి పైకిఁబోఁగా ద్వితీయప్రవరసేనునికి రాజ్యము లభింపఁగా విక్రమాదిత్యప్రవరసేనులకు సమకాలికత్వమెట్లు సంభవించును. రాజతరంగిణియందుఁ గాళిదాసుయొక్కయు సేతుకావ్యముయొక్కయుఁ బేరైనఁ గానరాదు. ఈకావ్యమునుఁ గాళిదాసు రచించి యున్నయెడల బాణాదులచే నతనికృతులయం దెందుకుఁ జెప్పఁబడలేదు? మాతృగుప్తునికే కాళిదా సని నామాంతర మున్నయెడల రాజ్యమును బరిత్యజించి కాశిలో నివసించువానికి ద్వితీయప్రవరసేనునితో మైత్రి యెట్లు సంభవించును? ఈవిషయమంతయు విచారసహముగా నుండలేదు. ఏల యనఁగా:—ఔచిత్యవిచారచర్చాదులయందు "యథామాతృగుప్తస్య, యథా కాళిదాసస్య" అని వేఱువేఱుగాఁ బేర్లు కానవచ్చుచున్నవి. కావున ననిశ్చితపదార్థమందు యాథాతథ్యగ్రహణాదరముచేఁ జాలును.

ఈమహాకావ్యమునకు కులనాథరామదాసశ్రీకృష్ణకృతము లగువ్యాఖ్యానములు మూఁడు కల వని Dr. Theodor Aufrecht మహాశయుఁడు Catalogus Catalogarum అనుగ్రంథములోఁ జెప్పియున్నాఁడు.

రామదాసనామధేయుఁడైన యీగ్రంథవ్యాఖ్యాత పురాతనజయపురాధీశుఁడైన మానసింహమహారాజునకు సకుల్యుఁడని వ్యాఖ్యానారంభశ్లోకములవలనఁ దెలియవచ్చుచున్నది. ఇతఁడు జల్లాలుద్దీనునకు సమకాలికుఁడు.

"చతుర్వ్యాతారిశీతాంశుభిరభిగణితే(1652) సాహసాంకస్యవర్షే। వర్షే జల్లాలదీంద్రక్షితిముకుటమణే రప్యనంతాగమాభ్యామ్। పంచమ్యాం శుక్లపక్షే నభసి గురుదినే రామదాసేన రాజ్ఞా। విజ్ఞే నాపూరి తోయం తిథితులితశిఖో రామసేతుప్రదీపః॥ జల్లాలదీనభూపాలనిత్యసేవనతత్పరః। బభూవ రామదాసాఖ్యో విప్రాణాముపకారకః। తాదృశాన్ బ్రాహ్మణాన్ దృష్ట్వా రామదాసో మహాయశాః। వితీర్ణసువర్ణదుర్వర్ణో బభౌ కర్ణఇ వాపరః."

Ancient History of the Deccan by G. Jouveau Dubreuil Doctor of the University of Paris, Professor, College, Pondicherry, 4th chapter. The Dynasties of Central Deccan.

వాకాటకవంశము.

దక్కనును బరిపాలించిన రాజవంశములలో వాకాటకవంశ మొకటియై యున్నదని యిప్పటివఱకు నెవ్వరుఁ దలంపరైరి. అది యుత్తరదేశమును బాలించిన రాజవంశములతోఁ గూడ విమర్శింపఁ బడవలసిన దని పాశ్చాత్యపండితు లందఱు నమ్మిరి. వాకాటకశాసనముల నుత్తరహిందూస్థానపు శాసనములలో నంతర్భవింపఁజేసిన కీల్‌హారన్ (Dr. Kielhorn) పండితుఁడితప్పుఁజేసెను.

ఇపుడు నేను దక్కనుప్రాచీనచరిత్రము ననేకగ్రంథములనుండి యెత్తి సంగ్రహముగా వ్రాయుటకుఁ బ్రయత్నించుచు నీదిగువ నుదాహరింపఁబడిన విషయమును బ్రకటించుచున్నాను. అదెమనఁగా :— వాకాటకులు దక్కను నేలిన రాజవంశములలోనే చేర్పఁబడవలసినవా రను పర్యవసానమునకు వచ్చితిని. మూఁడవశతాబ్ది మొదలుకొని యాఱవశతాబ్దివఱకు దక్కనును బరిపాలించిన రాజవంశము లన్నింటిలోను వాకాటకవంశమువారే మహాప్రభావసంపన్ను లనియు నధికతములనియు గొప్పప్రతిష్ఠాపరు లనియుఁ, గీర్తిమంతులనియు, సకలవిషయములయందు నితరరాజవంశ్యుల నతిశయించినవా రనియు నిర్వివాదముగాఁ జెప్పఁగలను.

ఈదిగువ వ్రాసినలేఖ్యప్రమాణములవలన వాకాటకులచరిత్రము వంశావళి సంగ్రహింపఁ బడుచున్నది.

1. Chammak Gupta Inscriptions (No. 55 P. 225.)
2. Siwani Gupta Inscriptions (No 56 P. 243)
3. Dudia (Indian Epigrapny ; Vol. III P. 258)
4. Balghat (Indian Epigraphy (Vol. IX P. 268)
5. Prof. K. B. Pothak's Plates (Ind. Antiquary Vol. XII 1912—P. 215)

6 Two inscriptions at Ajanta (A. S. W. J. Vol. IV P. 53, 124, 129)

7 The inscription in the Ghatotkacha Cave at Gurwara A. S. W J. Vol IX pp 64, 138.

వింధ్యశక్తి.
|
ప్రథమ ప్రవరసేనుఁడు
|
గౌతమీపుత్త్రుఁడు
|
ప్రథమరుద్రసేనుఁడు
|
ప్రథమపృథ్వీషేణుఁడు
|
ద్వితీయరుద్రసేనుఁడు
|
ద్వితీయ ప్రవరసేనుఁడు

- ఒకపుత్త్రుఁడు (పేరు లేదు)
  - దేవసేనుఁడు
    - హరిషేణుఁడు.
- రుద్రసేనుఁడు
  - ద్వితీయపృథ్వీషేణుఁడు.

ఇందు మొదటిమహారాజైన ప్రథమ ప్రవరసేనుఁడు వాకాటకవంశమునకుఁ బతాకవంటివాఁడైన వింధ్యశక్తికిఁ బుత్త్రుఁడు. ఇతఁడు రాజబిరుదము లెవ్వియును లేకుండ (A. S. W. J. Vol. IV p. 124) అజంతశాసనములలోఁ జెప్పఁబడెను. ప్రథమప్రవరసేనుఁడు క్రతుకర్త. ముఖ్యముగా నశ్వమేధయాజి మహారాజపద భాక్కు కాకపోవుటచేఁ బ్రాయికముగాఁ దండ్రికంటె ముందు కాలధర్మము నొందిన గౌతమీపుత్త్రుఁడు భారశివులకు రాజైన భవనాగుని పుత్త్రికను బెండ్లియాడెను.

పుస్తక పరిచయము.

— ఆంధ్రదేశపుచరిత్రము. —

మ॥ శ్రీ తేకుమళ్ల రాజగోపాలరావు బి. ఏ. గారిచే స్థాపింపఁబడిన ఆంధ్ర సరస్వతీగ్రంథమాల 20 వ కుసుమము. బందరులో సుప్రసిద్ధు లగు శ్రీచిల్లరిగె శ్రీనివాసరావుపంతులు బి. ఏ. గారిచే రచియింపఁబడినది. ఇందు 150 పుటలలో ఆంధ్రదేశచరిత్రము మొదటిభాగము వ్రాయఁబడినది. శాతవాహనయుగము, పల్లవయుగము, కాకతీయయుగము, రెడ్డియుగము, విజయనగరసామ్రాజ్యయుగము, మహమ్మదీయయుగము, పాశ్చాత్యయుగము నను నిట్టిభాగములు కలవు. మొదట 108 పుటల పీఠిక రాజగోపాలరావుగారిచే వ్రాయఁబడినది. ఇది వీరు తెలుఁగులు భరతవర్షములోఁ బ్రవేశించుటను గూర్చి చేసినపరిశ్రమ ఫలితము. అందుఁ దెలుంగజాతి-దాని ప్రాచీనబాంధవ్యము, తెలుంగజాతి యొక దేవత యను విషయములు గలవు. మఱియు, అఱవము, తెనుంగు, కన్నడము, మళయాళముల, ఇంగ్లీషు లాటిన్ భాషల సాదృశ్యము, శబ్దాదులంబట్టి వ్యాకరణసాదృశ్యములంబట్టి కనఁబఱుపఁబడినవి. మన మెఱుఁగకుండ నాయాదేశములలోఁ జేరిపోయిన యాంధ్రజాతులం దెలిపిరి. హిమాలయప్రాంతమునఁ దెలుంగుమూర్తి కలఁ డనియు నతఁ డసురజాతికిఁ జేరినవాఁడ నియుం గ్రొత్తవిషయముం దెలిపిరి. నేఁటికిఁ బదు నైదువేల సంవత్సరముల క్రిందట మనము (తెనుంగువారు) సుమేరుపుఁడి...నూత్నపరిస్థితులవలన భాషాచారములవలన సంబంధించిన మార్పులకు లోఁబడుచు గోండులతో భారతవర్షము చేరితిమి. రాజ్యములు సంపాదించితిమి, పోఁగొట్టుకొంటిమి, ఏకచ్ఛత్రముగా నాలుగుశతాబ్దములు భరతవర్షమునంతను నేలితిమి. శకపురుషులమై మనపేర శాలివాహనమును లోకమున కిచ్చితిమి......మనలోనుండి కొందఱు దక్షిణాభిముఖులై పోయి యఱవలైరి. పరశురాముఁడు గోదావరీతీరము నుండి మనవారిని గొనిపోయి మళయాళీలను జేసె నని యిత్యాదిగాఁ దెనుఁగువారిపూర్వవృత్తాంతమును గనఁబఱిచిరి. మూలముకంటెఁ బీఠికఁ జదువఁదగినది.

దీనివెల రు 2 లు. 124 వెల్లారివీథి- పరశువాకము-వేపేరి- చెన్నపట్టణములో తేకుమళ్ళ రాజగోపాలరావుగారియొద్ద దొరకును.

—: రాణా ప్రతాపసింహచరిత్రము :—

కావ్యకళానిధి, కవిసింహ, అవధానిపంచానన బిరుదాంకితులు శ్రీయుత దుర్భాక రాజశేఖరశతావధానిగారు దీనికర్త. రాజస్థానములోని మేవాడుదేశము

నకు ముఖ్యపట్టణము చిత్తూరు. మేవాడుదేశాధీశులకు "రాణా" లని పేరు. వారు చిత్తూరులో నివసించి దేశపాలనముచేయువారు, వారిది సూర్యవంశము, రామునితనయుఁడు లవుఁడు వీరికి వంశకర్త. అక్బరుచక్రవర్తికాలములో మేవాడు దేశమునకుఁ బ్రభువు, ప్రతాపసింహుఁడు. ఈతఁడే కథానాయకుఁడు. బహు కష్టములకుఁ బాల్పడియును నాత్మస్వాతంత్ర్యమునకై యిరువదియైదుసంవత్సరము లసహాయశూరుఁడై చక్రవర్తి యగు నక్బరుతోఁ బోరాడి జయముం గాంచిన యారాజుచరిత్ర మిది. చరిత్రజ్ఞు లీవిషయము నెఱుఁగకపోరు. మూలకథను మన కవిగారు టాడ్డుగారి రాజస్థానకథావళిలోనుండి గ్రహించి దాని కుపబలముగా నితరచరిత్రములనుండి కొన్నివిషయములను సంగ్రహించి, అయిదాశ్వాసములు 285 పుటలు 1900 పద్యములు గలబ్రహ్మాండమైన చరిత్రమును గా రచియించిరి. చిరకాలపరిశ్రమమునన నాంధ్రలోకమున కిట్టిపెద్దగ్రంథమును సమర్పించి వీరు ప్రశంసాపాత్రులైరి. దేశచరిత్రములలోనుండి యిదివఱ కెన్నఁడు నెవ్వరు నింత గ్రంథమును పద్యములుగ రచియించియుండ లేదు. రసానుగుణవర్ణనములతోఁ బద్యములు నిర్దుష్టముగఁ జక్కనినడకతో నొప్పుచున్నవి. పలువురు తలఁచునట్లు వీరిని యతిప్రాసము లేమియుఁ గష్టపెట్టలేదు. శంకరకవి చెప్పినట్టింక తాము దామే యుచితస్థితి వచ్చి నిల్చి-కష్టపెట్టునని భయపడువారిని నవ్వుచున్నవి. సీ. పద్మాసనమున దైవధ్యాననియతి నేత్రయుగంబు మూసెఁ బ్రతాపదేవుఁడు. (4ఆశ్వా.110ప.) ఇట్లన్నిటం జూడనగును. పదజాలము వశ్యమై యున్నవారు యతిప్రాసములకు భయపడుదురా. అట్టివారి నవి యలరించుం గాని యలయింపవు. వీరరసప్రధాన మగునదియైనను "కొమ్మలకును బల్లవనివహమ్ములవలె" నితరరసము లందందు లేకపోలేదు. చరిత్రము విఖ్యాతిం జెందినదియు- కవిగారి కవిత్వశైలికి—

తూఁచియుంచినమాడ్కిఁ దోఁచుశబ్దంబులహాయికి మదిలోన వలరి యలరి
సరసస్వభావపేశలమనోభావంబు లచ్చొత్తినట్లుండ మెచ్చి మెచ్చి
యాత్మావబోధరహస్యాంశములు నిండి యుబుకుట గని తలయూఁచి యూఁచి
ప్రసరించి నిలువెల్ల రసముట్టిపడునట్టి ఘట్టంబులను జూచి కరఁగి కరఁగి
యిప్పటి ప్రసిద్ధకవులుహర్షజలరాశి దేలెదరు.

సంస్కృతమునుండి యాంధ్రీకరించుటకును దేశచరిత్రముల నితరభాషలలోనుండి తీసి యాంధ్రగ్రంథమార్గమునకుం దెచ్చుటకును జాలభేద మున్నది. రెండవది మిగులకష్టము. కవిగారిని మే మింతవఱకుఁ బ్రస్తుతించెదము. గ్రంథవిస్తర

రీతిచే రెండుపద్యములను మాత్రమె యుదాహరించెదము. పాఠకులు గ్రంథము నామూలాగ్రముగఁ జదివి యానందించి కవిగారిని బహూకరింతురుగాక.

మ. శతధా ఖండముగాచు రాలె సమరస్థానాధ్యమంతు న్విశీ
ర్ణతనుత్రాణచయంబులున్ దళితకుంతలశ్రేణు లాపై విలుం
శితకాంతంబులు భగ్నఖడ్గములు, కుంభీభూతభేరుల్ నిపా
తితకేతువ్రజముల్ విఖండితముగాదీవ్య న్మహాదండముల్.

సీ. మొగలాయిసైన్యజీమూతగర్భమునుండి వెలిఁబాఱు పిడుగులపిండనంగ
యావనసుభటబాహాప్రతాపమహాగ్ని కడ లేచు నంగారకణము లనఁగ
రణమర్గ యుటిమి నేత్రముల రౌద్రముగ్రక్షఁ బొడమిన గొప్పనిప్పులనంగ
మృత్యుదేవత కోపమెత్తి తూరుపుపట్టఁ దో తెంచు కొఅవులతుంట లనఁగ
నల్లానే రేడుపండ్లంత లగుచు యవన, భటతతులనుండి వెడలు తుపాకిగుండ్లు
రాలె నీలోత్పలచ్ఛాయ రాజపుత్ర, సైనికులకుఁ గర్ణావతంసంబు లగుచు.

దీని వెల రు 1-8-0. ఇదియునుం గాక వీరియితరగ్రంథములును పెక్కులు గలవు. వలయువారు ప్రొద్దుటూరు మ్యునిసిపల్ హైస్కూలు హెడ్మాష్టరు పి. ఆర్. సుబ్రహ్మణ్యయ్యర్, బి. ఏ., యల్. టి., గారిపేర వ్రాసి పడయఁదగును.

—: వనౌషధి :—

శ్రీకాశీనుండి, శ్రీచంద్రశేఖరత్రివేదీ, ఆయుర్వేదాచార్య ఎం. ఏ. ఎస్. గారు ప్రకాశకులుగను శ్రీకేదారనాథశర్మగారు సంపాదకులుగను నూతనముగా వెలువడుచున్న హిందీ వైద్యమాసపత్రిక- ఆయుర్వేదశాస్త్రములో బహుప్రసిద్ధి గొన్న పండితులచే వ్రాయఁబడుచున్నది. మాకు దీని 4-5 సంచికలొకటిగాఁగలసిన సంచికయొకటి చేరినది. ఇందులో, ఆయుర్వేదాధునికవనస్పతిశాస్త్రము, భారతీయాయుర్వేదమునకు హ్రాస మేల కలిగెను, సోమము, మసూరి దానిం దప్పించుకొను నుపాయము, శంఖినియనునది యేది? క్షయరోగముయొక్క సంక్షిప్తేతిహాసము, వేదములోని వనౌషధులు, ఇత్యాదివ్యాసములు పెక్కుగలవు. ఆంధ్రదేశములో నిపుడు వైద్యమెఱుఁగనివారును, హిందీరానివారును లేరుగావున నీపత్రికం దెప్పించి తమకుఁ దెలియనివిషయములం దెలిసికొనియు, నితరులకుఁ దెలియనివిషయముల నీపత్రికాద్వారమునఁ దెలిపియు నన్యోన్యసహాయముం బొందుదురుగాక. కాశీలో చరక-అనుసంధానభవనములో నీపత్రికదొరకును.

చందా రు 3. వీరియొద్ద ననేకౌషధములు వైద్యశాస్త్రములును గలవు.

ఆవయవికనకారమునకు ద్రుతకార్యములు బాహుళికములు.

—: వఝల చినసీతారామస్వామి శాస్త్రిగారు—విశాఖపట్టణము :—

విచక్షణులారా! బ్ర. శ్రీ. ఉ. భా. ప్ర. దువ్వూరి సూర్యనారాయణ మూర్తిశాస్త్రులవారు భావసంవత్సర చైత్రవైశాఖపరిషత్పత్రికాముఖమున సన్నిక్రిందివిషయమున సమాధానమును వ్రాయఁగోరి యున్నారు. ఆంధ్రవిశ్వకళాపరిషదాంధ్రచ్ఛాత్రాధ్యాపనము,ఆంధ్రవ్యాకరణరచనము, మున్నగుకార్యములచే నవకాశము చాలకున్నను శ్రీశాస్త్రులవారు సదభిప్రాయముతో సమాధానమును బ్రకటింప నియోగించినందున నిట్లు సంక్షేపముగా వ్రాసికొనుచున్నాను.

లిఙ్థర్థ్యేత్యాదిసూత్రవివరణసందర్భమున నేనుదాహరించిన "రక్షించున్" అనుశబ్దమును, "చన్నే" అనుదానిలోని 'చన్' శబ్దమును ధాతుజవిశేషణములని నేనభిప్రాయపడి యుండ లేను. (చూడుఁడు. చింతామణివిషయపరిశోధనము 125; 98 పేరాలు.) కాని ధాతుజవిశేషణములు ద్రుతప్రకృతికము లనుట చింతామణిహృదయ మని నేనుస్థలాంతరములందు వ్రాసినమాట నిజమె. (చూడుఁడు. చింతామణివిషయపరిశోధనము 107 పేరా.)

ఇఁక సరళాదేశాదిద్రుతకార్యము లెల్లయెడలను నియతములు కావని నా నమ్మకము. ఈవిషయమునే యీ క్రిందివికృతివివేకకారిక విశదీకరించుచున్నది.

శ్లో. "వినాద్వి(తృ-అనుటలెస్స)తీయం స్యా దస్థ దాత్వనోః స్వతయో రపి
నో రన్యస్యాపి సర్వం స్యా ద్బహుళం సత్ప్రియోగతః"

ఈయథర్వణకారికచేత నావయవికనకారముమీఁద సరళాదేశాదిద్రుతకార్యములు బహుళములుగా నగు నని చెప్పఁబడుచుండుటచేత శాస్త్రులవా రుదాహరించిన 'జడిగొన్ కోర్ములన్' మున్నగు చోటులందు సరళాదేశాదులు రాకుండుట విరుద్ధము కానేరదు.

నప్రాణిపదములయందుఁ దిర్యక్పదముల నేకవచనంబు గలుగఁ బైన
నినలు రెండును రాక దనరుఁ బలకయందు నవనియందనఁ బక్షియందు నంచ
యందన్న యట్టు లుదంతమ్ములైనచో నమరు నత్వము వికల్పమున వినుఁడు
హారువునందుఁ జెఱువునం దన హారువందుఁ జెఱువందునన్నట్లు చెల్లు మఱియుఁ
బఱువునందు ననంగఁ బఱువందు ననఁ దేలునందుఁ దేలందు ననంగ నవల
నతిసప్తములు గల్గు జాడలయందు స్తమము లెల్లఁ బ్రథమరూపములు దాల్చుఁ
జుక్కలు వరుసఁగా సోరణగండ్లరా హారి యుర్జునునకుఁ బ్రా పగుచునుండ
నన మఱి హారి వెలయు నసురాళి పొలియు నిలఁ దనరఁగ గాడ్పులయు ననఁగ
నుగ్రునిభక్తిసేయుడు ధనమిచ్చుడు రసికులకు ఫలంబు లొసఁగుడు నన
నరవి నిట్టివి సతిసప్తములై యొప్పు నింకఁ దద్భేదంబు లెఱుకపఱుతుఁ
గాలవాచకముల కడల సప్తమికిఁ బ్రథమ వచ్చు రేమొలంత నిమురగనెఁ
బగలు మేల్కొనియుండెఁ బడఁతులతలమిన్న యొసఁగు వర్షాకాల మెట్టిదొరలు
దండువెడల రన ధరణీధవుకుమారుఁ డేఁడాది చదివెఁ గావేరిపరువు
నెలవర్తిలునదినా నెలదినాలగు సీత యనఁగ సీ క్రియ నుదాహరణము లగుఁ
దెలియ నచేతనమ్ముల సప్తమికిఁ ద్వితీయకు తృతీయము వచ్చు నది యెటులన
వని నున్నది మదేభవార మనులఁ దనయసిని జక్కగఁ జేసె నంగన మెయిఁ
గలప మలందెను బలిమి నసురఁ గెల్చె ననునిట్టు లక్ష్యము లనుఁడు సుకవు
లచ్చతెనుంగున నప్రాణివాచకోదంతములపయి సప్తమికి మఱి తృ
తీయకు నణ వచ్చుఁ దెలియ నాదేశమై కొమ్మన న్నిల్చెఁ గొంగునను విసరె
ననఁగ నిట్టుల నుదాహరణంబు లగు మఱి యప్రాణివాచకోదంతముల నె
కన్ను వెన్నును జన్ను మిన్నను నుకులకు: గుంట వెంటను జంట మింటననఁగఁ
జనుఁ ద్వితీయను బంచమిని సప్తమిని నొక్క రూపమౌ లక్ష్యముల్ రూఢివినుఁడు
చెలికంటఁజూచెను చెలికంటఁబొడమెను నిదికంటఁగాటుక నిడియె ననఁగ
వెలయుచునుండు నావల మఱి యప్రాణివాచకాదంతశబ్దములపయి నె
సఁగుతృతీయకును బంచమికి సప్తమికి నుకారము వచ్చు లక్ష్యములు వినుఁడు
తరలాక్షి బాహులతం గట్టెఁ జెలువుని లతను విరుల్ పుట్టె లతను జివురు
తగు నన నిఁక ఇదంతముల నాత్రి విభక్తులందుఁ బొల్లునకార మల నికార
మమరంగ వచ్చును విమతుం డసినిదెగటారె నసిం దెగటారె ననఁగఁ
గ్రౌంచము తొలిని రాయంచలు వెడలెనాఁ గడలి నిద్దురఁజెందెఁ గంసవైరి

యనఁగ నిట్టుల నుదాహరణలు తగు నింక స్థావరప్రాణివాచకము లగుచుఁ
దగు నుకారాంతశబ్దము లకారాంతము లగు పంచమీతృతీయలను సప్త
మి నల బహుత నేకతను రెంట ను జెలంగు గట్లనువచ్చెను గట్లవచ్చె
ననఁ జెలి వ్రేలఁ జూపెను వ్రేళ్ళఁ జూపెనా నొకయూరనిలుచు వాఁడూళ్ళనిలుచు
నన నింక నీకు గోరును నోరని యెడి శబ్దము లదంతంబు లౌతఱిని రేఫ
లకు టకారములు వాలాయంబుగా వచ్చు నీటను గోటను నోట ననఁగ
వీడు త్రాడును గోడు గూఁడను శబ్దముల డకారముల టకారములు వచ్చు
వీటఁ ద్రాటను గోట గూఁట నాఁదగు నింక నావలఁ గిఁ పరమైనయెడను
బూర్వమైన టకారముపయి నిత్వమువచ్చి యేటికి నేటికి నేటి కనఁగఁ
దనరారుచుండు నుదాహరణము లిట్లు క్రమమొకింతయుఁ దప్పక నింక నవల
వహిని నచేతనవాచకస్త్రీలింగములకు విశేషణాలున్న పుంస
కములునై వర్తిల్లుఁ గనుఁగొనుండుం డింక లెస్స హరిదృష్టి భాగ్యదాయక మనంగ
వెన్నునిసభ మణీవిలసితం బన నింకఁ దెలుఁగుబహువచనములకుఁ బ్రాణి
పదము వెలిగ నేకవచన మది విశేషణమయి తగు హరిగుణములు ఖ్యాత
మనఁగ నవ్వార్షంబు లధికంబన వడగండ్లాస్యస్రవత్సైన మయ్యె ననఁగ
నావలఁ దెలుఁగున నవ్యయాలయినట్టి పదములు కొన్ని యేర్పఱుతు వినుఁడి
యప్పుడిప్పుడు గాన నచ్చట నిచ్చట నక్కడిక్కడఁ గాక యాడ యీడ
మఱియు వేఱుఱు పలుమఱు గావున నటుగనక వెండి క్రమ్మఱ నాఁదగు నింకఁ
దెలుఁగున నొకకొన్ని స్త్రీ ప్రత్యయంబులు తెలియఁజెప్పెద సత్కవులు వినుండు
మొదలను గుణపదముల నెనయుచు మీఁద నాలున్న దానికి రాలు వచ్చు
రేఫ కచ్చుపకును గృతుల నొక్కొకచోట యతులు వికల్పాన నమరియుండు
జవరాలు గొడ్రాలు చనురాలు ముద్దరా లనఁగ నిల్లా ల్వేలయాలు దక్క
నవల నాఁడను ప్రత్యయము వచ్చి పగలాఁడి చిన్నెలాఁడి యనఁగఁ జెలఁగు నింక
నలకత్తె యను ప్రత్యయము వచ్చి సొగసుకత్తె వెలకత్తె చెలికత్తెయనఁ దనరు
నంత ఎత ప్రత్యయము వచ్చి గుజ్జెత కోమటెత యనఁగఁ దగును మఱి మొఱ
కెత చాకెత తిరుమాలెత బోయెతన వయోజాతివాచకముల సరణిఁ దనరు
నవల సాని ప్రత్యయము వచ్చి యేలికసానినా మంతరసాననఁ దగుఁ
బూవుఁబోఁడి మెఱుంగుఁబోఁణినా సుకుమారతను మనోహరతను దనరి రెండు
ననువుగ మతుబర్థమున నిపాతము లగు రహికెక్క నిటువంటి ప్రత్యయముల

నాద్యచ్చులను యతు లమరింపరాదింకఁ గారకములు దెల్పుతీరులు వినుఁ
డవలను గ్రియకు హేతువనంగఁ దగునది కారక మనుపేరు గాంచు నదియు
రహిఁ గర్తృకర్మకరణసంప్రదానముల్ కడునపాదానాధికరణము లని
యాఱువిధమ్ముల నగుఁ గారకమ్ము లవియె త్రయోవింశతివిధములఁ దగు
కర్తృకరణకారకములయందుఁ దృతీయ కర్మకారకమున కడుద్వితీయ
రహిసంప్రదానకారకమునందుఁ జతుర్థి దారిగా నలయపాదానకార
కమున బంచమి యధికరణకారకమున సప్తమి దగు వరుసఁగ నెటు లన
నీవలఱ కెవ్వ రీత్రోవ గాననియది తెలివిడిఁజేసెదఁ దెలియుఁ డింకఁ
గడువేడుక స్వతంత్రకర్తయు హేతుకర్తయుఁ గర్మకర్తయుఁ దగ నభిహిత
కర్త యనభిహితకర్తయు నని కర్త యైదు తెఱంగుల నలరు నందు
ఱేఁడిల నేలుచున్నాఁడనఁగ స్వతంత్రకర్త యగుచు లెస్స గానఁబడియె
వినయవంతులు హితంబునుబొందుదురు వారిఁ బొందించుహితమునుబుద్ధిమంతుఁ
డనుచు నీలాగున ననువొందఁ జెప్పిన స్ఫూర్తిగా నిది హేతుకర్త యయ్యె
హీనులదోషము ల్తానె కప్పుడు నని రహిదోషపదము కర్మంబు లేక
కర్త తానే యయ్యెఁ గనుక లెస్సగ నిది కనుఁగొనంగాఁ గర్మ కర్త యయ్యె
గొనకొని సూపకారునిచేత నన్నంబు పక్వంబుగాఁ జేయఁబడియెడు నని
యన్నంబు ప్రథమమై యలరెను గనుకయభిహితకర్తయగుచు వెలయుచుండు
వండు సువారంబువాఁ డన్న మనఁగ నీకరణి యనభిహితకర్తగు నిఁకఁ
గర్తకుఁ గ్రియచేతఁ గడునిష్టముగఁ బొందఁ దగినదిఁ కర్మాఖ్య దనరు నదియె
ఈప్సితకర్మ మనీప్సితకర్మంబు నలయీప్సితానీప్సితాఖ్యకర్మ
మకథితకర్మంబు సకర్తృకర్మం బభిహితకర్మం బనభిహితకర్మ
మనుచుఁ గర్మంబు సప్తాహ్వయంబులచేతఁ దగుఁ దెల్పెదను వరుసగ వినుండు
జనపతి యన్నంబు సాపడియెడు నన నీప్సితకర్మాఖ్య నెసఁగుచుండు
మును మూర్ఖుఁడు విషంబుఁదినియె ననఁగ నిది యయ్యనీప్సితకర్మయగుచుఁ దనరు
దొరకొని బాలుండు దువ్వగప్పినపాయసాన్నంబు మెసవెడి ననఁగ నిదియె
యీక్షింప నీప్సితానీప్సితకర్మాభిధానంబుచేతను దనరు మిగుల
నాదేవదత్తుండు యజ్ఞదత్తునెఱగొంగడి నడిగెడి నని వడిగ రెండు
కర్మంబు లనువు నకథితకర్మం బగుచుండును గృతులందు నూహసేయ
మూర్ఖ శిష్యుఁడు గ్రామమునుగూర్చి పోయెడిని గురుండు తచ్ఛిష్యునిమదినిఁదలఁ

పుచు గ్రామమునుగూర్చి పోఁజేయుచున్నాఁ డనిన శిష్యుఁ డలకర్మతను గనియెను
గనుక నిట్టిది కర్తృకర్మనామంబుచేతను దనరారుచుండును గణింప
శ్రీయజ్ఞదత్తునిచేఁ జాఁప వడి నల్లఁబడుచున్న దనఁ జాఁప ప్రథమమైన
కతన నిదియె యభిహితకర్మనామధేయంబుచేఁ బొల్పుగ నలరుచుండు
యజ్ఞదత్తుఁడు చాఁప నల్లుచున్నాఁ డనుకరణి యనభిహితకర్మ మయ్యె
నల క్రియాసిద్ధియం దత్యంతసాధనం బౌనది కరణాహ్వయ మగు నదియె
గణనగ బాహ్యకరణము శారీరకరణ మని కరణంబు ప్రబలు రెండు
తెఱఁగుల నెట్లన్న దేవదత్తుఁడు కత్తిచేతను జక్కనిచెట్టు నఱకు
చున్నాఁడనఁగ నిది యూహింప బాహ్యకరణ మగుచుఁ దలిర్చు రహికిన్నెక్క
శ్రీశుండు కన్నులచే రూపమును గ్రహియింపుచున్నాఁడన నిట్టి దెల్లఁ
బరికింప శారీరకరణాభిధానంబు చేతను మిగుల రాజిల్లు నింక
నీవి యొసంగుట కెవ్వాని గోరు నాతఁడె సంప్రదానాభిధఁ గను నదియు
మఱి ప్రేరక మ్మనుమంతృకమ్మును ననిరాకర్తృక మ్మని రహిగ సంప్ర
దానమ్ము త్రితయవిధము లగు నెట్లన గురుపుణ్యుఁ డగ్రజుకొఱకు నావు
నిచ్చుచున్నాఁ డన నిదియె ప్రేరకసంప్రదాన మగుచు లెస్సఁ దనరు మహిని
ఋషిరాజటు తెరువరికిఁ జెట్టునీడ యొసంగుచున్నాఁ డన సరవిగ నిది
యనుమంతృసంప్రదానాభిధానంబుచేతను రహికట్టియుండును దలంప
నరుఁడు హరికొఱకు విరియిచ్చుచున్నాఁ డనఁగ నిది పరికింప నాడెమమర
నల యనిరాకర్తృకాహ్వయసంప్రదాన మగుచుఁ దగుఁ బ్రబంధముల నింక
నొకచోటునుండి వేఱొకచోటి కరుగుట గానిపించిన నపాదాన మగును
జల మచలం బని యల యపాదానంబు రెండుపేరుల నొప్పుచుండు నందు
కాతు కదలెడి గుఱ్ఱమువలనఁ బడుచున్నాఁ డన దీనిచందము గణింపఁ
దగుఁ జలాపాదాన మగుచు నీలాగున నెసఁగుచు నుండును గృతులలోన
నొగి యజ్ఞదత్తకుం డూరనుండియుఁ జనుదెంచుచున్నాఁ డనఁ దెలియ నిదియె
నలువుమీఱ నచలనామకాపాదాన మనుచుఁ బొల్పెసఁగుఁ గావ్యములనింకఁ
గడుఁ గ్రియఁజెందిన కర్తృకర్మముల యాధార మధికరణమహా రహి నిది
యలయభివ్యాపక మనఁగ నౌపశ్లేషికం బన వైషయికం బనంగ
నవల సామీపికం బన నధికరణము నలు దెఱంగు లను జెన్నలరు నందు
నువ్వులయందున నూనె గల దన నిది యె యభివ్యాపకాధికరణ మగు

సీ. పచ్చతెక్కలనొప్పు పక్షిగుఱ్ఱము నెక్కి చెఱకువిల్లరుదుగఁ జేతఁ బట్టి
రోదసేయు గండుఁదుమ్మెదనారి నవరించి చెలువైనపూవుటమ్ములను బూని
యలరారు గండుగోయిలదండుఁ గని ముందు నడువుండటంచు నానతియొసంగి
సరసుఁడైన వసంతసచివునితోఁ గొంత మంతనం బొనరించి సంతసమున
ననికి వెడలి వియోగిసీజనమునొంచె, నలరుఁదూపుల మన్మథుం డనెడుజోదు
శూరు లెవ్వరుఁ దనసాటి గారటంచు, మాఱులేకపరాక్రమమహితుఁడగుచు.
గీ. కమలపాణికి నోడి సంగరములోనఁ, గమలపాణ్యభిధానము గ్రాంచుసతుల
నొంచుమరుఁ డెట్టిశూరుఁడటంచు మిగుల, విరహిణులు నింద చేసిరి విషమశరుని.
వ. ఇట్లు సంయోగులకు నానందకరంబును వియోగులకు దుస్సహతరంబును నై
యతివిచిత్రం బగు నవ్వసంతసమయంబున నద్దశరథేశ్వరుండు ఋష్యశృంగమునీం
ద్రుం గాంచి. ౨౧౦
సీ. వినయంబుతో మ్రొక్కి విహితపూజలు చేసి మునివర్య కారుణ్యమునను నాకుఁ
దనయులు గలుగంగఁ దగురీతి నశ్వమేధంబుఁ జేయు మటంచుఁ దగవరించి
మఱల నర్చించుచు మఱియు సన్మునులను భూసురవరులను బూజసేసి
తనమనోరథమున కనుకూలముగ వార లాశీర్వదింపఁగా నలరి యంత
మంత్రులనుజూచిహయమేధమఖు మొనర్చి, సుతులఁబడసెదఁగావునసురుచిరముగఁ
బూజతాశ్వంబు విడువుఁ డిప్పుడనవార, లధిపునానతి నట్టుల నాచరించి. ౨౧౧
గీ. ఏమఱికయుండఁగా నొక్కయేఁడునిండఁ, గ్రమ్మఱ వసంత మరుదేఱ నమ్మఖాశ్వ
మవనితలమందు సంచార మమరఁ జేసి, యేగుదెంచిన సచివు లిలేశుఁ జూచి.
చ. రఘుసుతపుత్ర యశ్వము నిరర్గళవృత్తిని వచ్చె నింక ని
మ్మఖముఁ బ్రయత్న మొప్ప నియమంబునఁ జేయఁగఁ బూనుటొప్పు నో
మఘవసమానతేజ యని మన్ననతోఁ డుతఁ దెల్ప నాతఁడు
న్విఘటితసంశయుం డగుచు వేడుక వారలఁ జూచి యిట్లనున్. ౨౧౩
క. సరయూత్తరతీరంబున, సరభసముగ నధ్వరార్హశాలలుఁ దగుచ
ప్పురములు మొదలుగ మీరలు, సరగున నొనరింపవలయుఁ జతురతమీరన్.
క. సవనోపకరణముల నతి, జవమునఁ దెప్పింపవలయు సభ్యులు నితోఁ
త్సవముల నలరెడు విబుధుల, సవనవిధిజ్ఞులను వేగ సమకూర్పఁ దగున్. ౨౧౫
గీ. అనిన మంత్రులు దేవ నీయాజ్ఞవలన, సవనముఖ్యోపకరణముల్ సంగ్రహించి
యునిచినారము వరసరయూత్తరమున, యజ్ఞవాటమొనర్చితి మధిప యింక.

క. ఏమియుఁ గొఱంత లేదన, భూమీశుం డాత్మఁ బొంగి పుణ్యచరిత్రుం
గామాద్యంతశ్శత్రు, స్తోమజయాన్వితు వసిష్ఠు సురుచిర తేజున్. ౨౧౭

వ. కనుంగొని యిట్లనియె. ౨౧౮

ఉత్సాహ. తరణితేజ నీవునాదు దైవమవు గురుండవుం
బరమసత్తపోధనుఁడవు పాకశాసనాదిని
ర్జరనుతుండ వజముకుందశంకరోపమానస
చ్చరితుఁడవు మహాత్మ నిన్ను సన్నుతింప నేర్తునే. ౨౧౯

క. అని వినుతించుచు మునిపద, వనజంబుల కెరఁగి నృపతి వారనిభక్తిన్
ఘనయాగము నిర్విఘ్నము, గను సాగింపంగ నీదిగా భారమనన్. ౨౨౦

క. సర్వేశ్వరుకృపచే నో, యుర్వీధవ నీమనోర్థి యొప్పెడు నింకన్
గుర్వశ్వమేధయాగము, నిర్విఘ్నముగాఁ జెలంగు నిక్కువము చుమీ. ౨౨౧

క. భీమాసురాది దుష్ట, స్తోమంబులఁ బాఱఁద్రోలుమను భూమీశా
నామంత్రశక్తిఁ దత్క్రియ, నేమఱ కుండెదను సంశయింపకుమదిలోన్. ౨౨౨

చ. అనుచు ధరాధినాథు వినయంబునఁ బ్రీతుని జేసి యంతటన్
మునిపతి యాసుమంత్రుఁ గని మోదముతో నిటు దెప్పు మైథిలున్
జనకుని రోమపాదవిభు సంతతమిత్రుని గేకయేశ్వరున్
ఘను లగువారిబంధులను గ్రక్కున యాగము చేయువేళకున్. ౨౨౩

వ. మఱియును. ౨౨౪

క. నాలుగుదిక్కులఁ గలభూ, పాలకులను దదనుచరులఁ బటుతరయాగ
శ్రీలుగనఁ దోడితెమ్మా, యాలస్యము చేయ కేగి యన నాతండున్. ౨౨౫

క. వల్లెయని పాకశాసన, ముల్లం బలరారఁ బూని యురుమణిభూషా
తల్లజ మృదువసనాదిక, సల్లలితోపాయనములు చయ్యనఁ గొనుచున్. ౨౨౬

చ. రయమున నేగి మాన్యుల ధరాపతులం గని సత్కరించి స
త్ప్రియవచనంబు లాడి యరుదెంచు మహీపతులార భాస్కరా
న్వయుపతి సేయు యాగముఁ గనంగ నటన్న సుమంత్రుతో నృపు
ల్నయ మలరార వేడ్కఁ బయనంబయి వచ్చి రతోషధ్య కెంతయున్. ౨౨౭

క. వచ్చిన రాజులఁ గనుఁగొని, విచ్చలవిడిఁ దగిన యట్టి విడిమరలందుం
జొచ్చెరఁ జెచ్చి వసిష్ఠుం, డచ్చుగ దశరథుని జూచి యనియెం బ్రేమన్. ౨౨౮

మత్తకోకిల. రాజు లందఱు వచ్చినారు ధరాతలంబునఁ గల్గువా
రోజతోడుత యాగకృత్యము లొప్పి యున్నవి డాసెఁగా
పూజనీయముహూర్త మిప్పుడు పొంది యుండిరి యాజకు
ల్వాజిమేధము వేగఁ జేయుము వారిజాప్తకులావనా. ౨౨౯

మ. అనిన న్భూపతి యుత్సఁ బొంగి తనజాయారత్నము ల్దానుఁ జ
య్యనఁ గాలోచితకృత్యము ల్సలిపి నెయ్యం బొప్ప శాంతాయుతు
న్ముని శాంతాత్ముఁ బురస్కరించుకొని సన్ముఖ్యు ల్వసిష్ఠాదులుం
జనుదేర న్రఘువాటిఁ జొచ్చె నిగమాంచద్వాక్యు లేపారఁగన్. ౨౩౦

వ. ఆసమయంబున. ౨౩౧

—: దశరథుండు యజ్ఞ మొనరించుట :—

క. భేరీమృదంగదరవీ,ణారవములు భూరివేదనాదంబులు వే
శ్యారమ్యగానరవము లు, దారములై మిన్నుముట్టెఁ దగనేకంబై. ౨౩౨

క. అప్పుడు ధరాతలేంద్రుం, డొప్పుల కుప్పలగు తనదు యువతులతోడ
న్నప్పున దీక్షం గైకొని, యొప్పెను మఖకర్మమునకు నుద్యతమతియై. ౨౩౩

వ. అంత. ౨౩౪

సీ. సరయూదకములు కాంచనకుంభములఁ బట్టి మొనసి కావళ్ళతో మోయువారు
శాలితండులములు సమకూర్చి యిచ్చిన దండిగా నన్నము ల్వండువారు
కందపెండలములఁ గదళీశలాటు లాదిగ శాకములు వండి నెగడువారు
గొప్పయప్పడములఁ బప్పఁ బచ్చళ్ళను బానకంబులఁ జేయఁబూనువారు
మానుగాఁ బిండివంట లమర్చువారు, పాయసాన్నము లొప్పగాఁ జేయువారు
నగుచుఁ గొండఱుభూసురులన్నరేంద్ర, కుంజరున కాత్మమోదంబుఁ గూర్చిరపుడు.

గీ. పనససహకారజంబీరరంభాకపిత్థ, నారికేళఫలాదు లుదారశక్తిఁ
దెచ్చి గుట్టలు పెట్టిరి తిప్ప లట్లు, గనఁబడఁగఁ గొంద ఱానందకలితు లగుచు.

గీ. దధిఘృతక్షీర శర్కరామధురసములుఁ, దైలలవణామ్లఫలములు చాలఁ దెచ్చి
యుంచి రధ్వరశాలల నొప్పమీఱ, వానిపరిమాణ మెన్నఁగా వశమె విధికి.

వ. ఇట్లు సకలసంభారంబులు సమకూర్చువారును దత్తద్వినియోగంబుల భూసు
రాదిసకలజనంబుల సతితృప్తులం జేయువారును విశేషించి దీనాంధబధిర కుబ్జా
దులఁ బ్రియవచనపూర్వకంబుగా భుజియింపఁజేసి సంతుష్టులం జేయువా
రును, సర్వజనంబులకుఁ దాంబూలవస్త్రాభరణంబు లొసంగువారును నై తత్త

త్విగ్యాజనాధికారు లేతత్ప్రకారంబున సమస్తజన మనోభిరామంబుగా నధ్వర
మహోత్సవంబు చేయుచున్నంత. ౨౩౮

క. ఘనులు వసిష్ఠాదిమహా, మునులు సభ్యసురులు శీఘ్రమున నాశాంతా
వనితావిభు రవినిభుఁ గనుఁ, గొని వేడ్కఁ బురస్కరించుకొని తత్క్రియకై. ౨౩౯

గీ. విహితరీతిని బ్రారంభవిధు లొనర్చి, గరుడపక్షాకృతిగ నిష్టకాసహస్ర
ములను గూర్చుచు నత్యంత విలసితముగ, వేదిక లలంకరించిరి మోద మొప్ప.

గీ. లలితవేదుల జాతవేదులను నిలిపి, శీఘ్రముగను బ్రదీప్తము ల్సేసి యపుడ
తగఁ బ్రవర్గ్యోపసదముఁ బ్రాతస్సవనము, సాధుమాధ్యందినతృతీయసవనములను.

సీ. కావించి రభసంబుగా నేకవింశత్యరత్ని ప్రమాణవిరాజితములు
ఖదిరబిల్వపలాశఘనయూపషట్కము ల్పటుదేవదారుయూపములు రెండు
నొక్క శ్లేష్మాతక యూపంబుఁ దెచ్చి యాయిరువదియొక్కటి వరుస నిలిపి
మహితచందనపుష్పమాలికాభరణనూతనవసనాలంకృతములు చేసి
యమితరుచిజాతరూపయూపములు వాని, చుట్టుశోభార్థముగ నిల్పుచనుజతుష్ప
దములఁ బక్షులవారిచరములఁ గూర్చి, యూపములఁ బరివేష్టించియుండ నునిచి.

గీ. నిగమమంత్రోక్తవిధిసమానీతమైన, యశ్వరత్నంబు యూపమధ్యమున నునిచి
యంత మున్నూఱు పశువుల నాగమోక్త, సరణిచేతను విశసించి సంతసమున.

క. జవమున నప్పశుపలలము, లవితథమంత్రములవలన నగ్నులయందున్
దివిషదులకు ముద మొదవఁగ, హవనము గావించిరపుడు యాజకులుదగన్.

సీ. అంతఁ గౌసల్య దా యాజకు లెఱిఁగింపఁ గైనొప్పు నిశితఖడ్గత్రయమున
ఖగసమేతముగఁ దురగము వధింప నధ్వర్యుఁ డుద్గాత హోతయును గూడి
యావాజి నప్పుడు యజనంబునకుఁ జేర్చి వేవేగఁ దద్వప వెలికి వహ్ని
యందు హోమము సేయఁ బొందుగాఁ దద్ధూమబృందంబు దశదిక్కులందుఁ బర్వఁ
గాఁ దదాఘ్రాణ మొనరించి కడఁకసర్వ, భూపతులు భూరిపాతకంబులను బాసి
రఖిలజనులుఁ గృతార్థులైయతిరయమున, ముదమునొందుచుఁ గలుషనిర్ముక్తులైరి.

క. పిమ్మట నత్తురగావయ, వమ్ములు వేదోక్తమంత్రవాక్తతి సుపవి
త్రమ్ములు చేయుచు నగ్నికి, నిమ్ముల నాహుతులు చేసి ఋత్విజు లెలమిన్.

వ. మఱియు జ్యోతిష్టోమాతిరాత్రాభిజిద్విశ్వజిదప్తోర్యామాదిక్రతుసహితంబుగా
నమ్మఖకర్మకలాపంబు సంపూర్ణంబు గావింప నద్దశరథుండు లబ్ధమనోరథుండై
యధ్వరదక్షిణ లొసంగం దలంచి హోతకుఁ బ్రాగ్దేశంబును, బ్రహ్మకు దక్షిణ

దేశంబు ను, నధ్వర్యునకుఁ బశ్చిమదేశంబు ను నుద్గాతకు నుదీచ్యదేశంబు ను
నిచ్చి తక్కినభూసురులకు నయోధ్యతక్కఁ దక్కినభూతలంబు నొసంగిన వార
లాదశరథుం జూచి యి ట్లనిరి. ౧౪౮

గీ. స్నానసంధ్యాద్యనుష్ఠానసరణిచేత, నిగమపాఠాదికములచేఁ బగలు రేయుఁ
దీర దొరకడి ధైన మాకీయుదెలిసి, భూము లిచ్చుట చిత్ర మా భూపవర్య.

క. కావున భూమికి మాఱుగ, గోవులను సువర్ణములను గురుతరమణులన్
భూవర మాకిడు సొంపుగ, నీవసుమతి నీవ యేలి నెగడుము వేడ్కన్. ౧౪౯

చ. అనుచు వసిష్ఠుఁ డాది యగు నార్యజను ల్వచియింప వారి క
జ్జనవిభుఁ డాత్మఁ బొంగి మణిసంఘములు న్వరధేనువర్గము
ల్ఘనకము లంబరంబులును గౌరవమొప్ప నొసంగఁ గొంచు న
మ్మనుజవరేణ్యుఁ జూచి కడు మన్ననతోడుతఁ బల్కి రందఱున్. ౧౫౦

సీ. దశరథ నీసుకృతంబుచే నిమ్మహాయాగంబు సుకృతమై యతిశయిల్లె
భూరిదక్షిణలను జారుతరాన్నప్రదానంబు కర్మవిధానములును
బరమేష్ఠితుల్య భూసుర సమాగమమును బరికింపఁ జిత్రమై పరఁగె నేఁడు
నీభాగ్యగరిమ వర్ణింపఁగా శక్యమే పంకజాసనబృహస్పతులకైన
సాంద్రకీర్తి హరిశ్చంద్రసార్వభౌముఁ, డర్కకులమణి యశ్వమేధాధ్వరంబు
జానుమీఱంగ మును చేసె దానిసమతఁ, జెందె నీయజ్ఞ మవనీపురందరుండ.

క. అని బహుభంగులఁ బొగడుచు, ఘనముగ నాశీర్వదింపఁగా దశరథుఁడు
న్మనమున గురుతరహర్షం, బెనయఁగ శాంతేశుఁజూచి యి ట్లని పలికెన్.

ఉత్సాహ. అష్టమూర్తితుల్య ఘనదయాసముద్ర నిన్ను నా
యిష్టదైవముగఁ దలంచి హితము గోరి యుంటి నీ
విష్టపత్రయంబునందు వినుతికెక్కఁ బుత్రకా
మేష్టి విధు లొనర్పవలయు నింపు గుల్కుచుండఁగాన్. ౧౫౩

గీ. అనినమ్ముని నిగమమంత్రానువృత్తి, నాజ్యధారాహుతులువహ్నియందు వేల్చి
తత్క్రియాకౌశలంబునఁ దనరుచుండ, హవ్యభుజు లంబుజోద్భవు నాడి రిట్లు.

క. ధాతా త్రిజగజ్జనసుఖ,దాతా నీతోడ నెన్నఁదగువిన్నపముల్
చేతుము గావున నీతఱిఁ, జేతోమోదంబుతోడఁ జేకొనవలయున్. ౧౫౫

వ. అది యెట్టి దనిన, ౧౫౬

సీ. రావణుఁ డనువాఁడు రాత్రించరేంద్రుండు నీవిచ్చువరమున నెగడుచుండి
యావరమున దేవకాంతలఁ జెఱపట్టి గరుడగంధర్వకిన్నరనిలింప
యక్షాదులను బట్టి శిక్షించుచుండెను మునుల విదారించె ముదముతోడ
దిక్పాలకులనెల్లఁ దెరలించె రణమున సకలలోకముల కీసరణిఁ బెక్కు
బాధ లొనరించుచుండెఁదద్బాహుశక్తి,కలిమికడలుచునినుఁడెండగాయవెఱచుఁ
బవనుఁ డెంతయు సంచరింపంగ నడలు, ధరణి తద్భీతిచేఁ గడుఁ దల్లడిల్లు.

క. వారినిధులైనఁ దద్భయ, కారణమున మ్రోయవెఱచుఁ గద కమలభవా
ధీరతవాఁ డొనరుచు బ, ల్దారుణములుదెలుప మాకుఁ దరమె మహాత్మా. ౨౫౮

క. నీవిఁక నుపేక్ష చేసిన, రావణుచే ముజ్జగములు రయమునఁ ద్రుంగుం
గావున మాపైఁ గృపచేఁ, గావింపుము వాఁడు మృతుఁడు గాఁ దగుచింతన్.

క. అని సురలు దెలుపఁ గమలా,సనుఁ డమరులఁ గాంచి విూరు సదమలమతులై
వినుఁ డిటు మున్నె యెఱుఁగుదు, దనుజాధముఁ డాచరించు దారుణబాధల్.

మ. ధర యక్షోరగకిన్నరేంద్రరిపుగంధర్వాదిదేవాలిచే
మరణం బెన్నఁడు లేకయుండి మది నున్మత్తత్వమేపారఁగా
వరముం గాంచెను గాని నావలన దేవద్వేషి యుద్ధంబున
న్నరుచేత న్మృతి నొందకుండ వర మందన్నేరఁ డప్పట్టునన్. ౨౬౧

గీ. కాన సంగరంబులోన మానవుచేత, నసుర గూలు సిద్ధ మమరులార
మును హిరణ్యకశిపుఁ డనుదానవేంద్రుని, ముదముతో నృసింహమూర్తిగూల్చె.

క. ఆదానవుండు మరల, న్మేదినిపై రావణాఖ్య విూఱఁగఁ బుట్టెన్
మాదరుఁడై వఱలెడుదా,మోదరుఁ డాతని వధించు నొప్పుగ నరుఁడై. ౨౬౩

తోదకవృత్తము. కావున మోదముగా మనమెల్లన్, దేవవరేణ్యుని దెల్వినిగొల్వం
గావఁగఁ జూచుసఖండదయన్ రా, జీవనిభాక్షుఁడు శీఘ్రముగాఁగన్. ౨౬౪

క. అని సురవరులుం దానును, మనమున సద్భక్తితోడ మాధవు భక్తా
వనుఁ బుండరీకలోచను, ఘనముగ ధ్యానించుచుండఁగా నవ్వేళన్. ౨౬౫

— శ్రీమహావిష్ణువు బ్రహ్మాదులకుఁ బ్రత్యక్షమగుట. —

సీ. శ్రీరమణీమణిశ్రితభూరివక్షుండు నలినబాంధవచంద్రనయనయుగుఁడు
శంఖచక్రగదాసిశార్‌ఙ్గహస్తుండును గాంచనవస్త్రయుగ్మాంచితుండు
వర్షావసరలసద్వారిదగాత్రుండు విధిజన్మవదనాభివిలసితుండు
కోటిసూర్యకసత్కిరీటమస్తకుఁడును దందశూకాంతకస్యందనుండు

విశ్వసంరక్షణాఢ్యుండు శాశ్వతుండు, బ్రహ్మరుద్రాది వందితపాదపద్ముఁ
డఖిలయోగీశ్వరేశ్వరుం డనఘచరితుఁ, డాదినారాయణుండు ప్రత్యక్షమయ్యె.

వ. ఇట్లు ప్రత్యక్షంబైన యనంతకోటిబ్రహ్మాండనాయకుం డగు నప్పరమేశ్వరుపాదా
రవిందమ్ములకు నరవిందభవ పురందరాది బృందారకు లమందానందకందళిత
హృదయారవిందు లై సాష్టాంగదండప్రణామంబు లాచరించి చతుర్వేదవా
క్సుమంబులం బూజించి సకలలోకవిద్రావణుం డగురావణుని వృత్తాంతం
బంతయు నెఱింగించి యి ట్లనిరి. ౨౬౮

క. దేవా మానవుచేతను, రావణదనుజుండు గూలు రణమునఁ గాన
న్వేవేగ నరుఁడ వగుచును, నీ విల జన్మింపవలయు నెమ్మి దలిర్పన్. ౨౬౯

సీ. దశరథుం డీతండు ధరణీపతులలోన ధార్మికుం డనఁ నొప్పు ధన్యకీర్తి
యితనిసతు లున్న రతులపతివ్రతల్ రమణీశిరోమణు లాజముఖులు
పుత్రలిప్సాయుతల్ పాత్రభూతలు గానఁ జతురంశముల నీవు సరభసముగ
వీరిగర్భములందు వేడ్కఁ బ్రవేశించి నలుగురు కొమరులై వెలయఁబుట్టి
మనుజరూపముతోడుత ఘనతకెక్కు, నీవు రావణు రణమున నెఱి వధించి
లోకములఁ బ్రోవవలయును బ్రాకటముగ, నఖిలలోకేశ విజితాశయఘవినాశ.

గీ. నిక్క మొక్క నీవు దిక్కి గావున మాకు, స్రుక్కి మ్రొక్కి తక్క కొక్క మనవి
చక్కఁజెల్పినార మక్కఱ దీర్పుమీ, పక్కి జక్కి నెక్కి నిక్కుఱేఁడ. ౨౭౦

గీ. అనిన మీకోరినట్టుల యాచరింతు, ననుచు బ్రహ్మాదిసురలకు నభయ మొసఁగి
యఖిలలోకేశ్వరుం డగు నారమేశుఁ, డనఘచరితుండు నిజపదంబునకు నేగె.

వ. తదనంతరంబ. ౨౭౨

సీ. రక్తాననుండును రక్తవస్త్రుండును రవినిభతేజుండు రమ్యమూర్తి
దుందుభిస్వనుఁ డరవిందాక్షుఁ డీక్షితభద్రలక్షణగణభాసురుండు
పరమాన్నయుతహేమపాత్రహస్తుం డొక్క దివ్యపూరుషుఁడు దేదీప్యమాన
హోమాగ్నివలన సమున్నతిచేఁ బుట్టి దశరథక్షితినాథుఁ దనరఁ జూచి
క్షితిప యేను ప్రజాపతి సుతుఁడ దేవ, నిర్మితంబును జంద్రికానిర్మలంబు
గదహారం బాత్మజోత్పత్తికారణంబు, పాయసం బిది నీకిత్తుఁ బర్వమొదవ.

మ. ఘనమీపాయస మంది నీసతుల మెక్కించేయు భూపాల స
త్తనయు ల్గలుగు రింక నీమనము మోదం బొందు నం చాతనిం
గని తత్పాత్రము చేతికిచ్చి యతఁడుం గావించుసుస్తోత్రవం
దనము ల్గాంచి సురోత్తముండు వెస నంతర్ధాన మొందెం దగన్. ౨౭౪

క. ఆదివ్యకనకపాత్రము, చేదోయిని దాల్చి యున్నక్షితిపతి యలరెన్
భూదేవసమితిలోపల, నాదట నిధిఁగొన్నపేద యట్టుల మిగులన్. ౨౭౫

సీ. అంతనద్దశరథుం డాత్మకాంతలఁ బిల్చి సంతోషనిర్భరస్వాంతుఁ డగుచుఁ
బరమాన్నమును రెండుభాగంబులుగఁజేసి కడకఁ గౌసల్యకుఁగైకకిచ్చి
వారిభాగములందు వరుసతో సగములుదెచ్చి సుమిత్రకు నిచ్చి వేగఁ
దరలాక్షులార మీరాతలఁచిన కోరిక ల్దీన సిద్ధించు సందియములేదు
కావునహరిస్మరణపూర్వకముగఁబాయ,సంబుఁదినుఁడని తెలుపనయ్యంబుజాక్షు
లతిరయంబునఁ బతి తెల్పినట్ల వేడ్క, నారగించుచు గర్భిణు లైరి పిదప. ౨౭౬

క. ఘనతహవిర్భాగంబులు, గొని దివమున కేగు దేవకోటులఁ గనుచు
న్వనజాసనుండు పలికెను, వినుఁడీ సురలార మీరు వినయముతోడన్.

శా. లోకశ్రేణిని బ్రోవఁగోరి తగ భూలోకంబునం బుట్టి యా
వైకుంఠుం డొగిఁ బంక్తికంఠముఖదేవద్వేషులం గూల్చి ని
ర్భీకుం డై సమరోర్విలోనఁ బటుదోర్వీర్యంబునం దజ్జయ
శ్రీకై మీరును దోడు గావలయు నిశ్చింతాత్ము లై యుండఁగన్. ౨౭౮

క. నరుఁ డగుచుఁ బుట్టు హరి యి, ధ్ధరణిని మీయంశములను దగవానరుల
న్నరగునఁ బుట్టింపుఁడు కిన్నరసురనరయక్షనాగనారులవలనన్. ౨౭౯

వ. మఱియు గరుడగంధర్వవిద్యాధరాది దేవకాంతలవలనను వనచరాంగనలవల
నను మహాబలసంపన్నులుం గామరూపులు నైన వలీముఖుల సృజింపుండు.

క. మును జాంబవంతుఁ డనియెడు, వనచరుఁ డేనావులింప వదనంబునఁ దా
జనియించి యున్నవాఁ డిల, ఘనసత్త్వపరాక్రమములు గలవాఁ డరయన్.

వ. అనినఁ బరమేష్ఠివచనంబులకు సంతసిల్లి వల్లెయని యమరులు సురలోకంబుం
బ్రవేశించి రంత. ౨౮౧

సీ. వాసవుండును వహ్ని వారిజాప్తుండును వాయుదేవుండును వనధిరాజు
గురుఁ డశ్వినీసుతు ల్నరవాహనుండును విశ్వకర్మయుఁ గడువేడ్కతోడ
వాలి నీలుని బలవంతు సుగ్రీవుని హనుమంతుని సుషేణు ఘనుని దారు
మైందద్వివిదులను మఱిగంధమాదను నలుని బుట్టించి రున్నతి దలిర్పఁ
బుడమిఁబర్జన్యుఁడునుశరభునిసృజించె, మఱియు సురవీరు లగచరమండలముల
నమరఁబుట్టించి రిలఁదమయంశములను,వనచరామరనృసతులవలనమిగుల. ౨౮౩

ఆంధ్రసాహిత్యపరిషత్తు—ప్రతిష్ఠాపకులు.

శ్రీరాజా రావు వేంకటకుమారమహీపతి సూర్యారావుబహద్దరువారు, పిఠాపురము మహారాజావారు. పరిషద్యావజ్జీవాధ్యక్షులు.

కీ. శే. శ్రీ వేంకటగిరి మహారాజావారు.

ఉద్ధారకులు.

శ్రీరాజా వేంకటాద్రి అప్పారావు బహద్దరువారు- ఉయ్యూరు జమీందారువారు.

కీ. శే. శ్రీబొబ్బిలి మహారాజావారు.

ఆంధ్రసాహిత్యపరిషత్కార్యనిర్వాహకవర్గము.

అధ్యక్షులు

జయంతి రామయ్యపంతులుగారు బి. ఏ., బి. ఎల్.

కార్యదర్శులు.

కిడాంబి రాఘవాచార్యులుగారు ఎం. ఏ., బి. ఎల్.

వింజమూరి వెంకన్న పంతులుగారు ఎం. ఏ.

కార్యనిర్వాహకసభాసభ్యులు,

దివాన్ బహదర్ కొమ్మిరెడ్డి సూర్యనారాయణమూర్తి నాయఁడుగారు (కోశాధ్యక్షులు.)

పెద్దాడ రామస్వామిగారు, ఎం. ఏ.

చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు.

కాశీభట్ల సుబ్బయ్యశాస్త్రిగారు.

శ్రీమాన్ గొడవర్తి జగన్నాథస్వామిగారు, ఎం. ఏ., ఎల్ టి.

దర్భా వేంకటశివరామరాజుగారు, బి. ఏ., బి. యల్.

అల్లక్కి వేంకట్రామయ్యగారు.

కేశవరపు రామరాజుగారు.

కోకా వేంకటసుబ్బారావు నాయఁడుగారు.

ఓలేటి వేంకటరామశాస్త్రిగారు, శతావధాని.

పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులుగారు.

పిశ్వారిశెట్టి రంగబ్రహ్మరావునాయఁడుగారు.

కాకినాడ—ఆంధ్రసాహిత్యపరిషత్తులో వెలకుదొరకు గ్రంథములు.

---

1 విప్రనారాయణచరిత్రము-చదలువాడ మల్లయ్యకవి		రు	0	8
2 కవిజనాశ్రయము-వేములవాడ భీమకవి	...	...	0	10
3 చంపూరామాయణము-ఋగ్వేదికవి వేంకటాచలపతికవి		...	1	0
4 నీతిసీసపద్యశతకము-తాళ్ళపాక పెదతిరుమలాచార్యుఁడు ...		...	0	2
5 జ్యోతిశ్శాస్త్రసారము-శ్రీమాన్ కపిస్థలం కృష్ణమాచార్యులుగారు		...	0	8
6 జ్ఞానప్రసూనాంబికాశతకము-శిష్టుసర్వశాస్త్రికవి	...	...	0	2
7 సర్వేశ్వరశతకము-యథావాక్కుల అన్నమయ్యగారు	...	...	0	2
8 యుద్ధమల్లుని బెజవాడ శిలాశాసనము- జ. రామయ్యపంతులుగారు		...	0	8
9 కావ్యాలంకారచూడామణి- విన్నకోట పెద్దయకవి	...	...	0	8
10 చంద్రభానుచరిత్రము-తరిగొప్పుల మల్లనకవి	...	...	1	0
11 అకారాద్యనుక్రమిత గ్రంథసూచిక	...	...	0	8
12 ప్రాకృతభాషోత్పత్తి-శ్రీమాన్ మేడేపల్లి వేంకటరమణాచార్యులుగారు		...	0	12
13 శివతత్త్వసారము-మల్లికార్జున పండితారాధ్యులు	...	...	0	12
14 Defence of Literary Telugu జయంతి రామయ్యపంతులుగారు		...	0	3
15 శివరాత్రిమాహాత్మ్యము-శ్రీనాథమహాకవి	...	...	0	12
16 అన్యభాషావిభాగము-శ్రీమాన్ మేడేపల్లి వేంకటరమణాచార్యులుగారు		...	0	8
17 Dravidian Lexicography జయంతి రామయ్యపంతులుగారు		...	0	4
18 ప్రాస్వరంగములు-కొత్తపల్లి సూర్యరావుగారు	...	...	0	8
19 నారసింహపురాణము—ఉత్తరభాగము-హరిభట్టు	...	...	1	0
20 మన్నారుదాసవిలాసనాటకము—రంగాజమ్మ	...	...	0	8
21 జైమినిభారతము-వచనము-వేంకటకృష్ణప్పనాయఁడు		...	0	12
22 కాళిందీకన్యాపరిణయము (రెండుభాగములు) అహోబలపతి		...	1	4
23 రెడ్లనాఁటి రెండుశాసనములు	...	...	0	4
24 ఆంధ్రధాతుమాల—చిన్నయసూరి	...	...	0	12
25 శాసనపద్యమంజరి	...	...	0	12
26 శతకసముచ్చయము (1-2 భాగములు)	...	...	1	6
27 పరిషత్పుస్తకభాండాగారము. (ద్వితీయభాగము)	...	...	0	8
28 సూత్రాంధ్రవ్యాకరణములు—చిన్నయసూరి	...	...	0	8
29 రసాభరణము —అనంతకవి.	...	...	0	8
30 చాటుధారావదతాత్పర్యసారః- (సంస్కృతము)	...	...	0	8
31 ఉత్తరరామచరిత్రము-జయంతి రామయ్యపంతులుగారు		...	1	0
32 షోడశకుమారచరిత్రము-వెన్నెలకంటి అన్నయ	...	...	C	8
33 అమరుకము-సాంధ్రము-జయంతిరామయ్యపంతులుగారు		...	1	0
34 సాంబోపాఖ్యానము-రామరాజురంగప్పరాజు	...	...	1	0
35 హంససందేశము-కల్లూరి వేంకటరామశాస్త్రిగారు	...	...	0	2
36 సింహాసనద్వాత్రింశిక-ద్వితీయభాగము-గోపరాజకవి	...	...	0	12
37 రాయవాచకము	...	...	0	8
38 ఆంధ్రశబ్దచింతామణి-బాలసరస్వతీకృతాంధ్రటీకోపేతము		...	0	8

Printed by N.Achutaramiah at the Cocanada Printing works, Cocanada.